07 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 129 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## మెజార్టీ స్థానాల్లో జెండా ఎగరేద్దాం

- అన్ని స్థానాల్లో మనకే అనుకూలం
- స్థానిక ఎన్నికలకు క్యాడర్ సన్నద్ధం కావాలి
- బిజెపి శ్రేణులకు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపు

**ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ మెజార్టీ స్థానాల్లో గెలుపొందేందుకు పార్టీ శ్రేణులు కృషి

## ఫార్మా రంగంలో మరో మైలురాయి

- తెలంగాణలో రూ.9 వేల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన అమెరికా కంపెనీ ,
- హైదరాబాద్ లో ఎల్ లిల్లీ కంపెనీ మాన్యుఫాక్చరింగ్ హబ్ ,
- ఇక్కడి నుంచే ప్రపంచ స్థాయి ఔషధాల తయారీ.. సేవల విస్తరణ ,
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎల్ లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్చరింగ్ హబ్ ను హైదరాబాద్ లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అందుకు అవసరమయ్యే ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ.9000 కోట్లు) భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. ఈ నిర్ణయంతో ఎల్ లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆర్టీఐ కమిషనర్ల బృందం

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
జూబ్లీహిల్స్ నివాసం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆర్టీఐ కమిషనర్ల బృందం. ఆర్టీఐ అవగాహన వారోత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సమాచార కమిషనర్లు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆర్టీఐ కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, ఎం. పర్వీణ్, డి భూపాల్, వైష్ణవి.



## రెవెన్యూ భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చండి

**సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కు భూసేకరణ వేగవంతం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
గత 30–40 సంవత్సరాల నుంచి రెవెన్యూ శాఖ తరపున వివిధ అవసరాల కోసం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు, వినియోగం, ప్రస్తుతం

బెంగుళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ని పరామర్శించిన



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. మల్లిఖార్జున ఖర్గేకు ఇటీవల పేస్ మేకర్ అమర్చిన వైద్యులు. సోమవారం రాత్రికి బెంగుళూరు నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకోనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బెంగళూరు వెలుతురు అక్టోబర్ 06:**

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

**బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ కొట్టివేత**

హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా విచారించలేం

సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ




**న్యూఢిల్లీ,అక్టోబర్6 ( వెలుతురు):**
**సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.**

హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు

## జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం

- దేశ చరిత్రలో ఇదో చీకటి రోజు
- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్,అక్టోబర్ 6( వెలుతురు):**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ



## ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యకలాపాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 6:**
పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు ఇవాళ ఆర్ట్ గ్యాలరీ సాంస్కృతిక కళాసారథి సంస్థల అధికారులతో మాదాపూర్ లోని ఆర్ట్ గ్యాలరీలో

## సుప్రీంతీర్పు శుభపరిణామం

- 42శాతం రిజర్వేషన్లకు ధోకా లేదు
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,అక్టోబర్6 ( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్ల పిటిషన్‌కు కొట్టివేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నేతలు స్పందించారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందిస్తూ.. సుప్రీం తీర్పు శుభ పరిణామమన్నారు.



## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

14న కౌంటింగ్..

అదేరోజు ఫలితం ప్రకటన



## సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం

**42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం**

**ఢిల్లీలో మీడియాతో మంత్రులు భట్టి, పొన్నం**

**న్యూఢిల్లీ,అక్టోబర్6 ( వెలుతురు):**
సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును న్యాయస్థానం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం..

## జస్టిస్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి ఘటనను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. ఇది క్షణికావేశంలో జరిగిన దాడి కాదని, పథకం ప్రకారం కుట్రపూరితంగా చేసిన దాడి అని

## రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ...కటింగ్ మాస్టర్



- రిబ్బన్ కట్ చేయడం లేదంటే...పథకాలు కట్ చేయడం
- మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తరలిస్తారు
- సిఎం రేవంత్‌పై ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్ 6( వెలుతురు):**
రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు అని, కటింగ్ మాస్టర్ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సిఎం తీరుపై ఎద్దేవా చేశారు. రేవంత్ జేబులో కత్తెర పెట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నాడని విమర్శించారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్ చేయడమే రేవంత్ పని అని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న

## మట్టి వాసనలు తెలిసిన రైతుబిడ్డ జస్టిస్ గోపాలగౌడ

వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం

ఎన్నో కీలక కేసుల్లో గోపాలగౌడ తీర్పులు చారిత్రాత్మకం

చింతామణిలో గౌడ పుస్తకావిష్కరణలో పవన్ కల్యాణ్



**బెంగళూరు,అక్టోబర్ 6( వెలుతురు):**
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాలగౌడ మట్టి వాసనలు తెలిసిన రైతుబిడ్డ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. డబ్బు కోసం

## మోగిన బీహార్ ఎన్నికల నగారా

- రెండు విడుతల్లో ఎన్నికల నిర్వహణ
- నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు
- నవంబర్ 14న కౌంటింగ్..అదేరోజు ఫలితాలు
- 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు
- ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు
- ఓటు వేయనున్న 7.43 కోట్ల మంది ఓటర్లు
- అందులో 3.92 కోట్ల పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 6( వెలుతురు):**
బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్ట నున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది.



పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్ లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్‌ఐఆర్‌పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం.




## పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులు

**స్వచ్ఛత కోరుకునే ప్రతిఒక్కరూ సేవకులే**

**ఆ కార్మికులు లేకపోతే స్వచ్ఛ ఉద్యమం లేదు**

**స్వచ్ఛతా అవార్డుల ప్రదానం కార్యక్రమంలోచంద్రబాబు**

**విజయవాడ,అక్టోబర్ 6( వెలుతురు):**
స్వచ్ఛత కోరుకునే ప్రతిఒక్కరూ సేవకులని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పరిశుభ్రతకు నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులని ఆయన తెలిపారు. స్వచ్ఛతను

వెలుతురు

## మెజార్టీ స్థానాల్లో జెండా ఎగరేద్దాం

చేయాలని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకరర్ లు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై ఎంపీ, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ మేరకు ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ బీజేపీ తరపున పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ఉత్సాహాన్ని చూపుతున్నారని అన్నారు. దీనికి గత 10 ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రన్ని భ్రష్టు పట్టించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ప్రజా వ్యతిరేక విధానాలు ఉన్నందుని బిజెపికి ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ జిల్లాలో సంస్థాగతంగా ఇప్పటికే బీజేపీ బలంగా ఎదిగిందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు జడ్పీ చైర్మన్ స్థానాల కైవసం కోసం బిజెపి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. బిజెపిలో కష్టపడే తత్వం ఉన్న కార్యకర్త వ్యవస్థ ఉందన్నారు. ఇతర పార్టీలోనీ కార్యకర్తల మాదిరిగా కాకుండా ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలు బిజెపిలో ఉన్నారని పేర్కొన్నారు. మెజార్టీ జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలను బిజెపి కైవసం కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేసారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, మయూరి చంద్ర నగేష్ రమేష్ . రాజు విజయ్ రాకేష్ పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవెన్యూ భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చండి

వాటి పరిస్థితి తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టల కోసం రెవెన్యూ విభాగం వేలాది ఎకరాల భూములను పలు విభాగాలకు ముఖ్యంగా ఇరిగేషన్, ఫారెస్ట్ శాఖలకు కేటాయించిందని అయితే రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టలలో మార్పులు చేర్పులు జరగడం తో పాటు కొన్ని రద్దుకూడా అయ్యాయని ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు. గడచిన 30 సంవత్సరాలలో అటవీ శాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన భూమి ఎంత, అదేవిధంగా అటవీ శాఖ రెవెన్యూ శాఖకు కేటాయించిన భూమి ఎంత అనే వివరాలను రెండు శాఖలు సమన్వయంతో ఒక నివేదికను తయారుచేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల అటవీ భూమి కేటాయించేందుకు ప్రతిపాదించారని ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కేశవపురం త్రాగునీటి పథకం కోసం రెవెన్యూ శాఖ గతంలో అటవీశాఖకు 1030 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే ఈ ప్రాజెక్ట్ రద్దయినందున సదరు భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదలాయింపునకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రిగారు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి , అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, పీసీ సిఎఫ్ , మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యకలాపాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష





సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్ట్ గ్యాలరీని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని, దాని నిర్వహణను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఆర్ట్ గ్యాలరీని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చిత్రకారులు, కళాకారులు దీనిని మరింత సద్వినియోగం చేసుకునేలా , కళా ప్రియులు, ప్రజలు, పర్యాటకులు ఎక్కువగా సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఈవెంట్లు నిర్వహించాలని శిశానిర్దేశం చేశారు. సాంస్కృతిక కళాసారథుల గురించి మాట్లాడుతూ, వారి వేతనాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాకారుల సేవలకు గౌరవం ఇవ్వడం ప్రభుత్వ ధర్మమని తెలిపారు. అలాగే, కళాసారథి కార్యాలయంలో ఉన్న ఆడియో – వీడియో స్టూడియోలో సౌండ్ ప్రూఫింగ్ పనులను తక్షణమే చేపట్టాలని, అందుకోసం అవసరమైన కన్సల్టెంట్ నిపుణుడి సేవలను వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. అంతకుముందు మంత్రి జూపల్లి అర్ధ్ గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యాలయాలను సందర్శించారు. ఈ సమీక్షలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నరసింహ రెడ్డి, సాంస్కృతిక కళాసారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ పాల్గొన్నారు.

## సుప్రీంతీర్పు శుభపరిణామం

42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీం కోర్టులో వేసిన కేసును కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని తెలిపారు. 8వ తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు సహకరించాలని మహేష్ గౌడ్ కోరారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్ అన్నారు. బీసీ బిడ్డలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇస్తే కొందరు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధిగా ఉందన్నారు. బీజేపీ బీఆర్ఎస్‌లు చేస్తున్న కుట్రలను బీసీలు అర్థం చేసుకోవాలని అన్నారు. బీసీ బిడ్డల నోటి దగ్గర ముద్దను లాక్కోవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు కుల సంఘ నాయకుని ముద్ర వేసుకుని కోర్టుకు వెళ్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ఉత్సాహాన్ని బీసీలు గమనిస్తున్నారని మహేష్ పేర్కొన్నారు.

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6( వెలుతురు):**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అనంతరం నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేస్తున్నట్లు పేర్కొంది. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ తదితర రాష్ట్రాల్లో పలు అసెంబ్లీ ఉప ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈనెల 13న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు ఈనెల 21 వరకు గడువు విధించనున్నట్లు సమాచారం. అలాగే స్వీకరించిన నామినేషన్లను 22వ తేదీన పరిశీలన చేయనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. బీహార్‌తో పాటే నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13, నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21, నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22, నామినేషన్ల ఉపసంహారణకు తుది గడువు: అక్టోబర్ 24 పోలింగ్ తేదీ: నవంబర్ 11, ఓట్ల లెక్కింపు : నవంబర్ 14న ఉంటుంది.

# ఫార్మా రంగంలో మరో మైలురాయి

సోమవారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం ఎల్ లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎల్ లిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎల్ లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎల్ లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్లో ఈ ఏడాది ఆగస్ట్ లోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్ ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మ హబ్ గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1961 లో ఐడీపీఎల్ స్థాపించినప్పటి నుంచే హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్ లో ఎల్ లిల్లీ కంపెనీ విస్తరణ తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని అన్నారు. ఎల్ లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని అన్నారు.

## సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

ఫైల్ చేశారని పిటిషనర్ తరపు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు. తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున... విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది ధర్మాసనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జీవో నెంబర్- 9ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. వీరు సీనియర్ న్యాయవాదులతో ఆదివారం నుంచి మంతనాలు జరిపారు. ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని కోరారు. దీంతో ఇక ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లేందుకు దాదాపుగా మార్గం సుగమమయ్యిందని భావిస్తున్నారు.

## సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం

కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం.. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం.. 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరితో ఉన్నాం.. ఈ రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం.. మా నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం అభిషేక్ మనుసింఘ్వి వాదనలు గట్టిగా వినిపించారన్నారు. అంతకు ముందు మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టు అంగీకరిస్తుందని తమకు నమ్మకం ఉందని చెప్పారు. ఇందిరా సహానీ కేసు తీర్పు ఆధారంగా తెలంగాణలో రిజర్వేషన్లు కల్పించవచ్చన్నారు. సిపెక్ సర్వే ద్వారా సమగ్రమైన జన గణన వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ల కల్పన కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా.. బీసీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో జరిగే వాదనలు సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి కోర్టుకు హాజరయ్యారు. సుప్రీం తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట వ్యాప్తంగా ఇంటికి ఇంటికి సర్వే నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సబ్ కమిటీ ద్వారా సమీక్షించి క్యాబినెట్ అనుమతి తీసుకొని దాన్ని అసెంబ్లీలో పెట్టి అన్ని రాజకీయాల పార్టీల ఏకగ్రీవ నిర్ణయంతో చట్టాన్ని గవర్నర్‌కు పంపించామని తెలిపారు. గవర్నర్ రాష్ట్రపతికి పంపించారన్నారు. అయితే దీనిపై కొంతమంది వ్యక్తులు కోర్టుకు వెళ్తున్నారని మండిపడ్డారు.రాష్ట హైకోర్టులో వాదనలు జరిగాయని.. ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళ్లొచ్చని చెప్పారని మంత్రి వెల్లడించారు. హైకోర్టులో ఈకేసుపై 8వ తేదీ విచారణ జరగాల్సి ఉందని.. ఈ లోపే వారు సుప్రీంకోర్టుకు వచ్చారన్నారు. న్యాయబద్ధంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ వచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంలో కేసు ఉన్నందున ఈ క్రమంలో తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని పిటిషన్ వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరాదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని పిటిషన్ దాఖలైంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ముందు కేసు విచారణకు రాగా పిటిషన్‌ను ధర్మాసనం విచారించేందుకు తిరస్కరించింది. దీంతో మంత్రులు సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించారు.

## రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు ... కటింగ్ మాస్టర్

సీఎం రేవంత్.. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ నగరంకి నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నాడని ప్రశ్నించారు. కేసీఆర్ చెమటోడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని, మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్ నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళు న్నారా? అని మండిపడ్డారు. తలకిందులుగా తప్పస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ఇక ప్రజలు నమ్మరు అని హరీష్ రావు అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు హరీష్ రావు సవాల్ విసిరారు. వడ్లకో నీతి, గోధుమలకో నీతా అని అడిగే దమ్ముందా? బీజేపీ ఎంపీలకు అని అడిగారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని.. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు, పూరా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చు. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుంది. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ తిరగడానికి సరిపోతుంది. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ నడుస్తుంది. పోలీసులు మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్కులో రాసుకుంటాం. మా ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతాం. కేసీఆర్ వచ్చాకే మార్కెట్ కమిటీల్లో బీసీలకు అవకాశం ఇచ్చాం' అని హరీష్ రావు చెప్పారు. 'సంగారెడ్డి జిల్లాలో లక్షా 20 ఎకరాల సాగు కోసం సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు తెచ్చాడు కేసీఆర్. త్వరలో సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలి అని జనాలు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రామిసరి నోట్, బాండ్ పేపర్లకు విలువ లేకుండా చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వలేదు కానీ 2 లక్షల పింఛన్లు తీసేశారు. రెండు నెలల పించన్ ఎగ్గొట్టారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి గ్రామంలో పంచాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటు అడగటానికి వస్తే హామీలపై నిలదీయండి. కల్యాణ లక్ష్మి పథకంలో 8 లక్షల తులాల బంగారం కాంగ్రెస్ పార్టీ బాకీ పడింది. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. రేవంత్ ఎన్నికల ముందు రజిని కాంత్ తర్వాత గజిని కాంత్ లా అయ్యాడు. ఫ్యూచర్ సిటీలో రోడ్లు, మూసి సుందరికరణ కోసం నిధులు ఉంటాయి. ప్రజలకు ఇచ్చే పథకాల కోసం మాత్రం నిధులు ఉండవు. కేసీఆర్ 33 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే రేవంత్ 19 వేల కోట్ల రూపాయలే రుణమాఫీ చేశారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని దద్దమ్మ, చేతగాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ గెలవడం పక్కా' అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# మోగిన బీహార్ ఎన్నికల నగారా

దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం అని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు. 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని, వారిలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. రద్దీ నిర్వహణ కోసం ఒక్కో బూత్‌లో 1200 మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వేసే పక్రియను ఈ ఎన్నికలతోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. రెండు దశల్లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. నవంబర్ 22లోపు ఎన్నికల పక్రియ పూర్తి చేస్తామని సీఈసీ చెప్పింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, ఆగస్టు 1న ఓటర్ల తుది జాబితా ప్రకటించామని సీఈసీ సభ్యులు తెలిపారు. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్ల జాబితాలో సవరణలకు ఇంకా అవకాశం ఉందని కూడా సీఈసీ తెలిపింది. నామినేషన్లకు 10 రోజుల ముందు కూడా.. ఓటరు జాబితాలో మార్పులు చేసుకోవచ్చని సూచించింది. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని,ఈసారి ఎన్నికల పక్రియ మరింత సులభతరం చేస్తున్నామని సీఈసీ వెల్లడించింది. బిహార్ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని సీఈసీ స్పష్టం చేసింది. బీహార్ మొదటి విడత ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 10న వస్తుంది. నామినేషన్ల దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 17. నామినేషన్ ఉపసంహరణ గడువు అక్టోబర్ 20తో ముగుస్తుంది. నవంబర్ 6 తేదీన మొదటి విడత ఎన్నికలు జరుగుతాయి. ఇక, రెండో విడత ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 13న విడుదల చేస్తారు. నామినేషన్ల దరఖాస్తుకు అక్టోబర్ 20 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 23 వరకూ అవకాశం ఉంటుంది. తుది దశ ఎన్నికల పోలింగ్ నవంబర్ 11న జరుగుతుంది. నవంబర్14న కౌంటింగ్ చేపట్టి అదేరోజు ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తారు. వృద్దులు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరే ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎలాంటి ఫిర్యాదుకైనా 1950 నెంబర్‌కు ఫోన్ చేసే అవకాశం ఉంటుందని, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. బిహార్ ఎన్నికల నుంచి కొత్తగా 17 సంస్కరణలు తీసుకొస్తున్నామని కూడా చెప్పింది. ఈ సంస్కరణలను భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలుచేస్తామంది. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 14 లక్షల మంది కొత్త ఓటర్లని సీఈసీ చెప్పింది. ఇక నుంచి ఇ÷ఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని ఎన్నికల సంథం తెలిపింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో జేడీయూ, భాజపా కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్డీయేను వీడి.. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో మహాగఠ్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధమూ ఎంతోకాలం నిలవలేదు. 2024 జనవరిలో మహా కూటమిని వీడిన జేడీయూ మళ్లీ ఎన్డీయేతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

## జస్టిస్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి సీతక్క

మంత్రి సీతక్క పేర్కొన్నారు. సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి కస్టోడియన్ అని, దాని ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టే అని ఆమె పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దాని పై దాడి చేయడం భారత ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధ మని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులు దేశ ప్రతిష్టను దెబ్బ తీస్తాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీతక్క డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం మన అందరికీ సమా నత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను ప్రసాదించిం దని, ఆ విలువల ను కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఆమె పిలుపునిచ్చారు.

# ఓటు హక్కు లేకుండా ప్రజాస్వామ్యం ఎలా?

**- బీహార్‌లో 37 లక్షల వోటర్ల గల్లంతు!**

**- డా. రేఖ బోయలపల్లి, ఉపాధ్యక్షురాలు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**



బీహార్ రాష్ట్రంలో జరిగిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చోటుచేసుకున్న అన్యాయాలపై తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సమర్పించిన ఆధారాల ప్రకారం, 22 లక్షల మహిళలు మరియు 15 లక్షల మంది పురుషులు, ముఖ్యంగా దళిత మరియు మైనారిటీ వర్గాలకు చెందిన వారు, ఎన్నికలకు ముందే ఓటరు జాబితా నుండి తొలగించబడ్డారు. ఇది సాధారణ సాంకేతిక సవరణ కాదు. ఇది ఎన్నికల మేనిప్యులేషన్‌కు పునాది, మరియు ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీసే వోటు దొంగతనం (Vote Chori) యొక్క ప్రారంభ దశగా పరిగణించవచ్చు. ప్రజాస్వామ్యం ప్రతి పౌరునికి సమాన హక్కులను హామీ ఇస్తుంది. అయితే అర్హులైన పౌరుల పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించడం, వారి ప్రాథమిక హక్కును హరించడం మాత్రమే కాకుండా, రాజ్యాంగ విలువలకు వ్యతిరేక చర్యగా నిలుస్తుంది. మహిళల, దళితుల మరియు మైనారిటీ వర్గాల స్వరాన్ని మూయించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ప్రతి అర్హుడి ఓటు హక్కు పునరుద్ధరించబడే వరకు మా పోరాటం నిరంతరంగా కొనసాగుతుంది.

# జస్టిస్ గవాయ్‌పై దాడి - దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసిన ఘటన

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన దేశ న్యాయవ్యవస్థ గౌరవాన్ని అవమానపరచే దుష్టచర్యగా అభివర్ణించారు. భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిన పత్రం అని, ఆ రాజ్యాంగాన్ని కాపాడే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. "న్యాయవ్యవస్థపై దాడి అనేది ప్రజాస్వామ్య పునాదులపై దాడితో సమానం. దేశానికి మార్గదర్శకులైన న్యాయమూర్తుల భద్రతకు భంగం కలిగించడం అసహ్యకరమైన చర్య," అని మంత్రి పేర్కొన్నారు దేశ గౌరవం, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతినేలా చేసే ప్రయత్నాలను కఠినంగా అణచివేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం బలహీనపడకుండా ఉండాలంటే ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. "డా. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన మన భారత రాజ్యాంగం మన అందరికీ శక్తి, సమానత్వం, స్వేచ్ఛను ప్రసాదించింది. ఆ విలువలను చెరిపివేయాలనే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు," అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

# ఎర్ర మంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**- పాలొన్న స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు..**





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**

ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 8కోట్ల వ్యయంతో కార్పోరేట్ స్థాయి హంగులతో ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నిర్మించాం, త్వరలో డిజిటల్ క్లాస్ లతో పాటు ఏసీ రూంలు ఏర్పాటు చేయనున్నాం. ఈ పాఠశాల తెలుగు రాష్ట్రాల్లో కెల్లా బెస్ట్ మోడల్ స్కూల్ గా నిలవనుంది, విద్యకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ప్రపంచంతో పోటీ పడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు,మా క్యాబినెట్ అంతా కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించాం. 20వేల కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో ఈ అధునాతన రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నాం నల్గొండలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్లాబ్ లెవల్ వరకు వచ్చింది ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలను ఇంత చక్కగా నిర్మించేందుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్,జిల్లా కలెక్టర్ హరిచందన,ఆర్ అండ్ బి అధికారులు,నిర్మాణ సంస్థకు నా శుభాకాంక్షలు.. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నా శుభాశీస్సులు.

# దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయి అధికారుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలను నీతి ఆయోగ్ (NITI Aayog) సహకారంతో ప్రారంభించిన ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్






**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**

హైదరాబాద్లోని గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ జాతీయ సంస్థ (ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్), నీతి ఆయోగ్ సహకారంతో, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ABP) లో భాగంగా రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్లను సోమవారం రోజున ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని డా. జి.నరేంద్ర కుమార్, ఐ.ఏ.ఎస్, డైరెక్టర్ జనరల్, ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్ ప్రారంభించారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌అడిషనల్ మిషన్ డైరెక్టర్ శ్రీ ఆనంద్ శేఖర్ కార్యక్రమ లక్ష్యాలు, దిశా నిర్దేశం వివరించారు. 2023లో నీతియాయోగ్ ప్రారంభించిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాకులను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం కన్వర్జెన్స్, డేటా ఆధారిత ప్రణాళిక మరియు 40 సూచికల సంతృప్తి (సాచురేషన్) విధానం ద్వారా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం ప్రారంభమైన ఈ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలు బ్లాక్ స్థాయి అధికారుల (Block Level Officers) సామర్థ్యాలను పెంచి, కీలక పనితీరు సూచికలు (Key Performing Indicators) సాధించడాన్ని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఉన్నాయి.

నేటి (అక్టోబర్ 6) నుండి ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్ దేశవ్యాప్తంగా ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, విద్య, సామాజిక అభివృద్ధి మరియు ఆర్థిక చేర్పు (Financial Inclusion) అనే ఐదు ప్రధాన రంగాలపై ఈ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ శిక్షణలు దేశవ్యాప్తంగా 9 కేంద్రాల్లో అక్టోబర్ 6 నుండి నవంబర్ 20, 2025 వరకు జరుగుతాయి. మొత్తం 126 శిక్షణా బ్యాచ్లలో సుమారు 5,000 మంది బ్లాక్ స్థాయి అధికారులు, ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోస్, బ్లాక్ ప్రముఖులు పాల్గొంటారు. ప్రారంభ సభలో డైరెక్టర్ జనరల్ డా. జి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ లక్ష్యాలను స్థాయిమట్టంలో కార్యరూపంలోకి తీసుకురావడంలో ఫీల్డ్ అధికారుల పాత్ర కీలకమని అన్నారు. కన్వర్జెన్స్, ఇన్నోవేషన్ మరియు సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. "రియల్టైమ్ మానిటరింగ్, ఉత్తమ ఆచరణలను పునరావృతం చేయడం, స్థానిక పాలన బలపరచడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' దిశగా ముందుకు సాగాలి" అని ఆయన అన్నారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌అడిషనల్ మిషన్ డైరెక్టర్ శ్రీ ఆనంద్ శేఖర్ మాట్లాడుతూ, పాల్గొన్న అధికారుల గత విజయాలను ప్రశంసించారు. ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్ రూపొందించిన ఈ విస్తృత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రశంసిస్తూ, సాచురేషన్ లక్ష్యాల సాధనకు లక్ష్యబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణా మాడ్యూల్స్ ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్ అధ్యాపకులు రూపొందించగా, నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌అడిషనల్ మిషన్ డైరెక్టర్ శ్రీ ఆనంద్ శేఖర్యోగ్ సహకారంతో తుది రూపం పొందాయి. ఈ కార్యక్రమాన్ని డా. ఆర్.అరుణ జయమణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, మరియు డా. పి.కేశవరావు, హెడ్, CRTCN, ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్ సమన్వయం చేస్తున్నారు. గ్రామీణాభివృద్ధి రంగంలో సామర్థ్యవృద్ధి ద్వారా సమగ్ర, సుస్థిరాభివృద్ధి సాధనకు ఎన్.ఐ.ఆర్.డీ.పి.ఆర్ చేపట్టిన మరో మైలురాయిగా ఈ కార్యక్రమం నిలిచింది.

# మంత్రి తుమ్మల చొరవతో పత్తి కొనుగోళ్లలో తొలగిన ప్రతిష్టంభన

**- పత్తి రైతులకి ఇబ్బంది కలగకుండా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని జిన్నింగ్ మిల్లర్స్ ని మరియు సీసీఐ వారిని ఆదేశించిన మంత్రి**

**- జిన్నింగ్ మిల్లర్లు నష్టపోకుండా సీసీఐ అధికారులు కూడా తగు చర్యలు తీసుకోవాలి**

**- సీసీఐ వారు ప్రతి వారం పత్తి కొనుగోళ్లను సమీక్షించుకుని కొనుగోళ్లు సవ్యంగా జరిగేటట్లు ఎప్పటికి అప్పుడు చర్యలు తీసుకోవాలి -మంత్రి తుమ్మల**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**

సోమవారం రోజున సచివాలయంలో పత్తి కొనుగోలుకు సంబంధించి ఏర్పడిన ప్రతిష్టంభన తొలగే విధంగా సీసీఐ అధికారులు, వ్యవసాయ మరియు మార్కెటింగ్ అధికారులు మరియు జిన్నింగ్ మిల్లర్లతో మరో మారు రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీసీఐ టెండర్లలో విధించిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లర్ల అభ్యంతరాలను అధికారులతో చర్చించడం జరిగింది. సీసీఐ విడుదల చేసిన టెండర్ లో లింట్ శాతం ఎల్ 1. ఎల్ 2 అలాట్మెంట్ స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ కొరకు ఉన్న నిబంధనల పై సుదీర్ఘంగా చర్చించారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే మన రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు వెంటనే టెండర్లలో పాల్గొని ఎలాంటి జాప్యం లేకుండా పత్తి కొనుగోళ్లు ను ప్రారంభించాలని మరియు పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సీసీఐ అధికారులను మరియు జిన్నింగ్ మిల్లర్లను మంత్రి ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలిగే చర్యలు ఎవ్వరు చేపట్టిన ఉపేక్షించేది లేదని మంత్రిగారు స్పష్టం చేశారు. సీసీఐ వారు ఈ సంవత్సరం పత్తి కొనుగోళ్లలో కొత్తగా తీసుకువచ్చిన నిబంధనలలో ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే, సీసీఐ అధికారులు ప్రతి వారం సమీక్ష నిర్వహించుకొని జిన్నింగ్ మిల్లర్లు కూడా నష్టపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి సూచించారు. జిన్నింగ్ మిల్లుల పరిశ్రమకు సంబంధించిన కొత్త మార్గదర్శకాల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరించడానికి స్వతంత్ర ఏజెన్సీ ద్వారా సమస్యలను పరిశీలించి ధృవీకరించుకొని ఎప్పటికప్పుడు తగిన నిర్ణయం తీసుకోవాలని రైతులకు మరియు జిన్నింగ్ మిల్లర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సీసీఐ వారు చూడాలని మంత్రి సూచించారు. రైతుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లర్లు వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని , సీసీఐ వారు కొనుగోళ్ల ప్రక్రియ కోసం వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలనీ , రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాల పరిరక్షణ కు ఎంత దూరమైనా వెళుతుందని తెలపగా మంత్రి గారి సూచనలతో ఏకీభవించిన సీసీఐ మరియు జిన్నింగ్ మిల్లర్లు కొనుగోళ్లకు సంబంధించి అన్ని ప్రక్రియలు వెంటనే పూర్తి చేసి రానున్న వారం రోజుల్లో రైతుల నుంచి పత్తి సేకరిస్తామని తెలియజేయడం జరిగింది. మంత్రి తుమ్మల గారి చొరవతో పత్తి కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది.

వ్యవసాయ శాఖ వారు ఈ లోపు మొబైల్ యాప్ మరియు స్లాట్ బుకింగ్ యాప్ పై విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించగా ఇప్పటికే మండలాల వారీగా రైతు వేదికల ద్వారా ఈ యాప్ గురించి స్లాట్ బుకింగ్ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ వారు సీసీఐ తో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబర్ గూర్చి కూడా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు మంత్రి తుమ్మల. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు శ్రీ గోపి ఐఏఎస్, సీసీఐ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ లలిత్ కుమార్ గుప్తా, శ్రీ పూర్ణేష్ గురునాని, డైరెక్టర్ (ఫైబర్), టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి భాయి, రాష్ట్రంలోని సీసీఐ బ్రాంచ్ మేనేజర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉన్నత అధికారులు మరియు రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు టార్గెట్ గా పనిచేయాలి

**- ఆయిల్ ఫెడ్ మరియు 13 ప్రైవేట్ ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి సమావేశం.**

**- తెలంగాణ ఆయిల్ ఫామ్ హబ్ గా మారాలి**

**- పది లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుతో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలవనుంది**

**- ఆయిల్ ఫామ్ సాగు విస్తరణలో నిర్లక్ష్యం వహించే కంపెనీ లపై చర్యలు - మంత్రి తుమ్మల**





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**

ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు టార్గెట్ గా ఆయిల్ ఫెడ్ మరియు 13 ప్రైవేట్ ఆయిల్ ఫామ్ కంపెనీలు టార్గెట్ ప్రకారం పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశా నిర్దేశం చేశారు. సోమవారం నాడు సెక్రటేరియట్ లో ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ సాగు విస్తరణలో కంపెనీల నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 2.72 లక్షల ఎకరాల్లో 73,696 మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారు.వచ్చే మూడు సంవత్సరాల్లో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ పది లక్షల ఎకరాలకు చేరేలా కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ టార్గెట్ రీచ్ అవ్వాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా కి మంత్రి తుమ్మల సూచించారు. వారం రోజుల్లో మరోమారు ఆయిల్ కంపెనీల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ పురోగతిపై నిర్దిష్టమైన కార్యాచరణ కోసం సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. తోటల యాజమాన్యం పై అన్ని కంపెనీలు దృష్టి పెట్టాలని కొత్త తోటల గెలలు దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షణ చేయాలని, నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని ,తక్కువ ఎత్తు ఆకు పొడవు తక్కువ ఉండే షార్ట్ వెరైటీస్ సీడ్ లింగ్స్ దిగుమతి చేసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. ఆయిల్ ఫామ్ రైతుల సందేహాలు నివృత్తి కోసం ప్రతి కంపెనీ తమ పరిధిలో రైతు సలహా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సరిపడా సిబ్బందిని నియమించాలని కంపెనీల వారికి మంత్రి తుమ్మల సూచించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. దేశంలోనే మొట్టమొదటిదైన సీడ్ గార్డెన్ నుంచి దేశీయంగా వాతావరణ పరిస్థితులు తట్టుకునే నూతన హైబ్రిడ్ ఆయిల్ ఫామ్ మొక్కల ఉత్పత్తి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రానున్న రోజుల్లో దేశానికే తెలంగాణ ఆయిల్ ఫామ్ హబ్ గా మారనుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీమతి యాస్మిన్ బాషా,ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి,ఆయిల్ ఫామ్ కంపెనీల ప్రతినిధులు ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.



# సంపాదకీయం.. రాష్ట్రాలను మింగేస్తున్న ఉచిత పథకాలు !

ఉచిత పథకాలు, నగదు బదిలీలు రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా..తమ చేతికి ఎముక లేదన్నట్లుగా పాలకులు వ్యవహరిస్తున్నారు. తాజాగా ఎపిలో ఆటోడ్రైవర్లకుచేయూత కింద ఒక్కొక్కరికి 15వేలు జమ చేస్తున్నారు. డ్రైవర్లకు 15వేల పథకం ప్రారంభంలో ఓ మహిళా డ్రైవర్ తమ ఇంట్లో ఎన్ని ఉచిత పథకాలు అందుతున్నాయో తెలిపారు. ఒక ఇంట్లో ఉన్న వారందరకీ ఇలా నగదు అందితే రాష్ట్రం దివాళా తీయకుండా ఉంటుందా? దీనన్ని ఎలా సమర్థించుకుంటారు. జనసేనాని, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా ఈ పథకాలను సమీక్షించాలని కోరుకోవడం లేదా? ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాలు దివాళా దిశగా పయనిస్తున్నాయి. ఒకవైపు ఉచిత పథకాలు, మరోవైపు రాజకీయ నాయకుల ఖర్చులతో రాష్ట్రాలు కుదేలవుతున్నా..ఎవరు కూడా పట్టించు కోవడం లేదు. ఉమ్మడి ఎపి విడిపోయాక కెసిఆర్, జగన్‌ల కారణంగా ఇప్పుడు దాదాపు రెండు రాష్ట్రాలు సుమారు 15 లక్షల కోట్ల అప్పుల్లో మకూరుకుపోయాయి. వీటికి వడ్డీలకు డబ్బులు కట్టలేకపోతున్నారు. నెలనెలా వేలకోట్లు వడ్డీలకే చెల్లిస్తున్నారు. డ్రైవర్లుకు 15వేలు, మహిళలందికీ ఉచిత బస్సులు, దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ రేషన్ కార్డులు, కిలో రూపాయికి సన్న బియ్యం పథకాలు, ఆరోగ్యశ్రీలు, ఉచిత విద్యుత్, రైతుభరోసాలు, ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇక ఎంపిలు, ఎమ్మెల్యేలకు లక్షల్లో జీతాలు, రెండు పెన్షన్లు, రకరకాల ఖర్చులు, హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో నేతల




పర్యటనలు.. ఇవన్నీకలసి తడిసి మోపెడు అవుతున్నాయి. దారిద్య్ర రేఖకు ఎగువన ఉన్నవారు కూడా తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా చర్యలు లేవు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించాలనే విషయంలో కూడా శాస్త్రీయత పాటించడం లేదు. ఇందిరమ్మ ఇళ్లకోసం నిజమైన అర్హులు అన్నది పక్కకు పోయి నేతలు ఎంపిక చేసిన వారి పేర్లు ముందుకు వచ్చాయి. రాష్ట్రమంతటా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే రాష్ట్ర బ్జడెట్ కూడా సరిపోదు. అలాగని కొందరికి మాత్రమే ఇళ్లు కేటాయిస్తే మిగిలిన వారిలో అసంతృప్తి నెలకొంటుంది. అన్ని పథకాలనూ ఒకేసారి ప్రారంభించాలనుకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యం కాని నిర్ణయాలు తీసుకుంటున్నారు. చంద్రబాబు కూడా తొలినాళ్లలో ఉచిత పథకాలకు దూరంగా ఉండేవారు. కానీ అధికార యావతో ఆయన కూడా ఉచిత పథకాలనే ఆశ్రయిస్తున్నారు. అధికార మత్తులో పడ్డవారికి రాష్ట్ర బాగోగులు పట్టడం లేదు. అవినీతి విషయంలో కూడా ప్రభుత్వాలపై విమర్శలు మొదలయ్యాయి. కొంతమంది మంత్రులు అపరిమిత అధికారాలను అనుభవిస్తుండగా, ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యం లేకుండా పోతోందని శాసనసభ్యులు వాపోతున్నారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తెలంగాణలో ఇంకా నిరుద్యోగులకు ఉద్యోగాల జాతర అన్నది ఇచ్చిన హామీ మేరకు కార్య రూపం దాల్చడం లేదు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్నది సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఏంజరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. సమగ్రప్రణాళిక చేయకుండా కొన్ని కార్యక్రమాలను హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై విమర్శలు వస్తున్నాయి. పథకాలను విశ్లేషించడం లేదు. కేవలం కిలో రూపాయికే సన్నబియ్యం గురించి గొప్పలు చెబుతున్నారు. వడ్డీలు తగ్గించుకునే ప్రయత్నాలు అటు చంద్రబాబు, ఇటు రేవంత్ రెడ్డిలు చేయడం లేదు. ఉచిత పథకాలను గొప్పగా చెబుతున్నారు. పెన్షన్ల పంపిణీకి నెలనెలా చంద్రబాబు హెలికాప్టర్లు వేసుకని ఊరేగుతున్నారు. తెలంగాణలో దాదాపు రూ.25వేల కోట్ల మేర రుణమాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేర లేదు. వరదలు వస్తే సకాలంలో ఆదుకోవడం లేదు. రోడ్లు గుంతలు పడిపోతే బాగు చేయడం లేదు. ఇటీవలి వరదల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కేంద్రంపై ఆధారపడడం తప్ప రాష్ట్రప్రభుత్వం పెద్దగా చేసిందేమీ లేదు. అందుకే రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు జరగలేదు. ఎపిలో పేదలకు ఇళ్ల విషయం లోనూ ఇదే జరుగుతోంది.

అక్కడంతా అమరావతి, పోలవరం చుట్టూ చంద్రబాబు ప్రదక్షిణ చేస్తున్నారు. చీప్ లిక్కర్ కేసులో ఇప్పుడు సొంతపార్టీ నేతలే దొరకడంతో తెలుగుదేశం ఇరకాటంలో పడింది. గతంలో ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు వారు అపరిమిత అధికార దర్పాన్ని ప్రదర్శించారు. అవినీతిని ప్రోత్సహించారు. అప్పులు చేసి రాష్ట్రాలను ఆర్థికంగా దివాళా తీయించారు. డబ్బులను పందేరం చేసి ఓట్లను కొనాలని చూశారు. అయినా ప్రజలు గెలిపించలేదు. ఇప్పుడు చంద్రబాబు, రేవంత్ అదే పనిచేస్తున్నారు. ఇలాంటి పథకాలను సమీక్షించాలి. ఆర్థికంగా దెబ్బతీస్తున్న పథకాలను అదుపులోకి తేవాలి. ఉచిత పథకాలను రద్దుచేయాలి. లేదా క్రమబద్దీకరించాలి. ముఖ్యమంత్రులు ఇప్పటికైనా పరిస్థితులను మదింపు చేసుకొని తగు దిదిద్దుబాటు చర్యలు చేపట్టని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయినా ఆశ్చర్యపోవాల్సింది ఉండదు. తెలంగాణలో అధికారంలోకి రావాలని భారతీయ జనతా పార్టీ కలలు కంటోంది. కానీ ఉచిత పథకాలు, ఆర్థిక దుబారాపై మాట్లాడడం లేదు. గతంలో సుప్రీం కోర్టు పలు సందర్భాల్లో ఉచిత పథకాలపై అనేక హెచ్చరికలు చేసింది. ఇది అనుసరించి సమీక్షించుకునే సమయంగా చూడాలి. లేకుంటే తెలుగు రాష్ట్రాలు మరింత దివాళా తీసి జీతాలు కాదుకదా దేనికీ డబ్బులు లేకుండా వడ్డలు కట్టుకుంటూ కూర్చునే దుస్థితి రాగలదు.

## కడప జిల్లాలో మరోమారు భారీ వర్షం

**- మైదుకూరు ప్రాంతంలో నీట మునిగిన పంటలు**

**- పంట నీట మునగడంతో ఉల్లి రైతుల ఆందోళన**

**కడప,అక్టోబర్6 ( వెలుతురు):**

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుండి పడినటువంటి అధిక వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంటలు నీట మునగడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఉల్లి పంట సాగు చేసిన రైతులు ధరలు లేక ఒకవైపు అల్లాడుతున్నారు. ప్రస్తుతం తిరిగి వర్షానికి నీట మునగడంతో ఉల్లి గడ్డలు మాత్రం పనికిరావని దిగాలు చెందుతున్నారు. గత వారం రోజుల నుండి మినుము, వేరు శనగ, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు సాగు చేసిన రైతుల పంటల పొలాల్లో నీరు అధికంగా వచ్చి చేరిందని విత్తనాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. సోమవారం తెల్లవారుజాము నుండి పడిన వర్షం వలన మైదుకూరు మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె, గంజికుంట, ఉత్సలవరం, వనిపెంట, చాపాడు మండల పరిధిలోని ద్వారకానగరం ,జడ్జీగారి కొట్టాలు గ్రామాల పరిధిలో గత వారం రోజులుగా సాగుచేసిన పంటలు నేలపాలయ్యాయి. సాగు ఖర్చులు పెరిగి వ్యవసాయం భారం అవుతుందని దానికి తోడు ప్రకృతి వైపరీత్యాల వలన విత్తనాలు, ఎరువులు దెబ్బతింటుండడంతో అధిక భారం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఉల్లి సాగు చేసిన రైతులు ధరలు లేక అల్లాడుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.500 కు నామమాత్రంగా కొనుగోలు చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షం పడడంతో ఉల్లిగడ్డలను సేకరించేవారు కనిపించే పరిస్థితి లేదని రైతులు పేర్కొంటున్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## వరుసగా రెండోరోజూ ట్రాఫిక్ జామ్

**- హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఇక్కట్లు**

**- ఎల్‌బి నగర్ మెట్రో వద్ద కిలోమీటర్ వరకు ప్రయాణికుల క్యూ**

**హైదరాబాద్,అక్టోబర్6 ( వెలుతురు):**


దసరా సెలవులకు వెళ్లిన వారు తిరిగి రావడంతో వరుసగా రెండోరోజూ విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. నల్గొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వంతెన నిర్మాణ పనుల వల్ల ఈ సమస్య ఏర్పడింది. దసరా సెలవుల తర్వాత ప్రయాణికులు నగర బాట పట్టడంతో వాహనాల రద్దీ నెలకొంది. మరోవైపు పంతంగి టోల్ ప్లాజాతో పాటు చౌటుప్పల్, దండు మల్కాపురం వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేసారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చింతలకుంట నుంచి కొత్తపేట వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. చింతలకుంట పైవంతెనపై ట్రావెల్స్ బస్సులు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్ కారణంగా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. దసరా పండుగ




సెలవులు ముగియడంతో ప్రజలు హైదరాబాద్ తిరిగి చేరుకుంటున్నారు. దీంతో ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎంతకూ వాహనాలు కదలక పోవడంతో జనం మెట్రో రైలును ఆశ్రయించారు. దీంతో ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ఈ నేపథ్యంలో మెట్రో సిబ్బంది ప్రయాణికులను క్యూ పద్ధతిలో పంపిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చిన వారితోపాటు ఆఫీసులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు పెద్ద సంఖ్యలో ఉండటంతో కిలోమీటర్ మేర క్యూలైన్‌లో నిల్చున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. క్యూలైన్ నుంచి ప్లాట్‌ఫారం వద్దకు చేరేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతున్నది. మరోవైపు చౌటుప్పల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నల్లగొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు వాహనాలు నిలిచిపోయాయి. దసరా సెలవుల తర్వాత ప్రయాణికులు నగరబాట పట్టడంతో వాహనాల రద్దీ నెలకొంది. మరోవైపు పంతంగి టోల్ ఎ÷-లాజాతో పాటు చౌటుప్పల్, దండు మల్కాపురం వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

**- హైదరాబాద్ పాతబస్తీ విద్యార్థి దుర్మరణం**



**హైదరాబాద్,అక్టోబర్6 ( వెలుతురు):**

అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి మృతిచెందారు. మూడు రోజుల క్రితం డల్లాస్‌లో దుండగుడి కాల్పుల్లో మీర్‌పేట వాసి పోలే చంద్రశేఖర్ మరణించిన విషయం తెలిసిందే. తాజాగా చికాగోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంచల్‌గూడకు చెందిన షెరాజ్ మెహతాబ్ మొహమ్మద్ (25) చనిపోయారు. ఆదివారం ఇల్లినాయిస్ ఈవెన్‌స్టన్ వద్ద జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మరణించినట్లు తెలుస్తున్నది. విషయం తెలుసుకున్న అతని కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఉన్నత అవకాశాల కోసం తమ కుమారుడు అమెరికాకు వెళ్లి చనిపోయాడంటూ షెరాజ్ తండ్రి అల్తాఫ్ మొహమ్మద్ కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహాన్ని ఇక్కడికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. చంద్రశేఖర్ చనిపోయాడన్న వార్త తెలిసి 48 గంటలు గడువకముందే అమెరికాలో మరో హైదరాబాదీ మృతిచెందడం గమనార్హం. కోటి ఆశలతో ఉన్నత చదువులు చదివేందుకు అమెరికా వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి విగతజీవిగా మారాడు. తమ కుటుంబంలో వెలుగు నింపుతాడనుకున్న కుమారుడి మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. హైదరాబాద్‌లో బీడీఎస్ చదివి ఎండీఎస్ చదివేందుకు అమెరికా వెళ్లిన మీర్‌పేట వాసి పోలే చంద్రశేఖర్(27) డాలస్‌లో దుండగుడి కాల్పుల్లో మరణించాడు. ఫుల్‌టైమ్ జాబ్ కోసం వెతుక్కుంటూనే డాలస్‌లోని గ్యాస్ ఫిలింగ్ స్టేషన్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి విధుల్లో ఉన్న సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి(నల్లజాతీయుడు) అకస్మాత్తుగా వచ్చి, కాల్పులు జరిపినట్లు తెలిసిందని చంద్రశేఖర్ తల్లిదండ్రులు చెప్తున్నారు. దీంతో తమ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందాడని యూఎస్ అధికారులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఘటనపై అమెరికాలోని తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసి, దర్యాప్తు వేగవంతం చేయాలని కోరినట్లు చెప్పారు. పెద్ద చదువులు చదువుకొని గొప్పగా తిరిగి వస్తారనుకున్న తమ కుమారులు విగతజీవులుగా మారడంతో ఇరు కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి.

## తారా జువ్వలా దూసుకెళ్తున్న బంగారం ధరలు

**- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,23,420**

**- కిలో వెండి సుమారు రూ.1.54 లక్షలకు చేరిక**

**న్యూఢిల్లీ,అక్టోబర్6 ( వెలుతురు):**

బంగారం ధర రోజురోజుకూ దూసుకెళ్తోంది. రోజుకో కొత్త రికార్డు సృష్టిస్తూ అందనంత ఎత్తుకు చేరుకుంటోంది. ట్రంప్ టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులు, కేంద్రీయ బ్యాంకుల కొనుగోళ్లు కలిసి పుత్తడికి ఇన్నాళ్లు డిమాండ్ పెంచగా.. తాజాగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ ఇంకా కొనసాగుతుండడంతో బంగారం ధరకు పట్టపగ్గాల్లేకుండా పోయింది. దీంతో అంతర్జాతీయ విపణిలో ఔన్సు ధర 4 వేల డాలర్ల దిశగా పయనిస్తోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగా పసిడి ధర సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర సోమవారానికి 3935 డాలర్లకు చేరింది. డాలర్ విలువ రూ.88.79 కావడంతో దీని ధర ఎక్కువగా ఉంది. ఈ ధరలను అనుసరించి హైదరాబాద్‌లో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,23,420కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,10,700 పలుకుతోంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందదన్న అంచనాలు, డాలర్ ఇండెక్స్ క్షీణించడం, అమెరికా బాండ్ల రాబడి పడిపోవడం వంటివి ఇప్పటికే బంగారానికి డిమాండ్ పెంచాయి. మరోవైపు భౌగోళిక అనిశ్చిత పరిస్థితుల కారణంగా డాలర్‌కు బదులు కేంద్ర బ్యాంకులు పసిడి నిల్వలను పెంచుకుంటూ ఉండడం మరో కారణమని అనలిస్టులు చెబుతున్నారు. అటు కిలో వెండి ధర కూడా రూ.లక్షన్నర దాటింది. హైదరాబాద్ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో వెండి సుమారు రూ.1.54 లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. బంగారం ధర ఈ స్థాయిలో పెరుగుతుండడంతో సామాన్యులు బంగారం కొనేందుకు వెనకాడుతున్నారు. దీంతో క్రయవిక్రయాలు చాలా వరకు తగ్గాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర ఆభరణాల వైపు మగువలు మొగ్గుచూపు తున్నారని



చెబుతున్నారు. పసిడి ధర తాజా దూకుడుకు అమెరికా షట్‌డౌన్ ఆజ్యం పోసింది. అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి డేటా ఏదీ అందుబాటులో లేకుండా పోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన మానిటరీ పాలసీ నిర్ణయాలకు కూడా ఈ డేటానే కీలకం. ఇంకా ఎన్నాళ్లీ అనిశ్చితి కొనసాగుతుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో పుత్తడికి తాజాగా మరింత డిమాండ్ పెరుగుతోంది.

## సుప్రీం కోర్టులో అనూహ్య ఘటన

- చీఫ్ జస్టిస్‌పై న్యాయవాది దాడికి యత్నం



**న్యూఢిల్లీ,అక్టోబర్6 ( వెలుతురు):**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసేందుకు ఓ న్యాయవాది యత్నించాడు. ఈ ఊహించని పరిణామంతో అక్కడున్నవారంతా కలవరపాటుకు గురయ్యారు. సుప్రీంకోర్టు లో కేసు విచారణలో భాగంగా వాదనలు జరుగుతుండగా ఓ న్యాయవాది సీజేఐపైకి బూటు విసిరేందుకు యత్నించాడు. గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవన్నారు. అనంతరం తన విచారణను కొనసాగించారు. ఘటనకు కారణమైన న్యాయవాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## బాగ్ అంబర్పేట్ మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్ గౌడ్ ను పరామర్శించిన బండారు దత్తాత్రేయ



**బషీర్ బాగ్ వెలుతురు 6 అక్టోబర్ :**
బాగ్ అంబర్పేట్ మాజీ కాంగ్రెస్ కార్పొరేటర్ సీనియర్ నాయకుడు పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్ ను.పరామర్శించిన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తన నివాసం లో కలుసుకొని ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు మీ ఆరోగ్యం మంచిగా ఉండాలని కోరారు.

## శ్రీశ్రీశ్రీరామాంజనేయస్వామిదేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**మంచాల వెలుతురు అక్టోబర్ 6:**
మంచాల మండలం దాదుపల్లిగ్రామంలో నూతనంగా నిర్మించిన రామాంజనేయస్వామి దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పాడి పంటలు బాగాపండి ప్రజలందరూ సంతోషాలతో జీవించాలని అన్నారు ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య దాదుపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ నర్సింగ్ అనిత వెంకటేష్ గౌడ్, యాచారం మండలం మాజీ జెడ్పిటిసి కర్నాటి రమేష్ గౌడ్, మంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బద్రీనాథ్ గుప్తా స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామాంజనేయ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## దాదుపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ రామాంజనేయస్వామి దేవాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి





**మంచాల వెలుతురు అక్టోబర్ 6:**
మంచాల మండలం దాదుపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ రామాంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది ధ్వజస్థంభ ప్రతిష్టాపన శివలింగం లింగం ప్రతిష్టాపన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన హెూమం కార్యక్రమాలు రామాంజనేయస్వామికి వేదపండితులు ప్రత్యేక పూజలుచేసి రామాంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ పూజా కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తనయుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆరుట్ల మాజీ సర్పంచ్ సుంకరి పాండరి నాథ్ గౌడ్ చిదేడు మాజీ సర్పంచ్ బైరకరమా కాంత్,రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారగోని సత్యనారాయణగౌడ్, మాధగోని జంగయ్యగౌడ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి, మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ నాయకులు,శివ యాదవ్ రాజేష్ పాండాల శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం

మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ ట్వీట్ చేశారు. దేశ న్యాయవ్యవస్థలోని అత్యున్నత అధికారిపై దాడి చేసి బెదిరించడానికి జరిగిన దుర్మార్గపు ప్రయత్నాన్ని తాను మాటల్లో ఖండించలేనని చెప్పారు. ఇది మన దేశ చరిత్రలో చీకటి రోజు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇటువంటి పిరికి దాడులకు తాను భయపడబోనని ధైర్యంగా ప్రకటించిన ధైర్యవంతుడైన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ కి దేశ పౌరులతో కలిసి తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు రాసుకొచ్చారు..సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసేందుకు ఓ లాయర్ యత్నించాడు. కేసు విచారణలో భాగంగా వాదనలు జరుగుతుండగా ఓ న్యాయవాది సీజేఐపైకి బూటు విసిరేందుకు యత్నించాడు. గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకున్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.. ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని, తాను చలించడం లేదని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని వ్యాఖ్యానించారు. అనంతరం కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని జస్టిస్ గవాయ్ కోరారు.

# పద్మశాలీల ఐక్యతతోనే రాజ్యాధికారం

### - దసరా మేళ కమిటీ మీడియా సమావేశంలో కమర్తపు మురళి

**హైదరాబాదు వెలుతురు అక్టోబర్ 06:**
ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట లోని ఆ సంఘ కార్యాలయంలో సోమవారం ఈనెల 12 న నిర్వహించే 23వ దసరా మేళా ఉత్సవాల గురించి ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 22 సం.ల నుండి క్రమం తప్పకుండా, పద్మశాలీల అభివృద్ధి కొరకు ప్రతి సంవత్సరం మేళాను నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ మేళాల ను నిర్వహించడం ద్వారా పద్మశాలీల ఐఖ్యత, పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో పోటీ చేసి పద్మశాలీల సత్తా చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కలయికల ద్వారా పద్మశాలీల ఆత్మ విశ్వాసం పెంపొందించుటకు మాత్రమే గాకుండా ఐక్యతకు కూడా తోడ్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విధమైన దసరా మేలాలలో మనం అధిక సంఖ్యలో పాల్గొని రాజకీయ పార్టీలకు మన బలం ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు . పద్మశాలీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధించుకోవచ్చని అన్నారు. అక్టోబర్ 12 న వనస్థలిపురంలోని హరిణి వనస్థలి ఎకో పార్కు లో దసరా మేళ ఎంతో ఆహ్లాద కరమైన



వాతావరణంలో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్రంలో పద్మశాలీయులంతా పెద్ద ఎత్తున హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దసరా మేళ కమిటీ చైర్మన్ కౌకుంట్ల రవితేజ, అఖిలభారత పద్మశాలి సంగం మీడియా మీడియా విభాగం జాతీయాధ్యక్షులు అవ్వారి భాస్కర్ , తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

### మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**మంచాల వెలుతురు అక్టోబర్ 6:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాష కార్యదర్శి రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంచాలసహకార బ్యాంక్ చైర్మన్ వెధిరే హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన బరిలో నిలిచే ఎంపిటిసి సర్పంచ్ లకు వార్డ్ మెంబర్లకు అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ ఐక్యంగా కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయటానికి సిద్ధం కావాలి అన్నారు గ్రామంలోని 14వార్డులకు కమిటీలు వేసుకొని కమిటీ సభ్యులు ప్రతి గడపకు వెళ్లి తెలంగాణ రాష్ట్రంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ ల సంక్షేమ పథకాల గురించి వివరించేలా ప్రణాళిక సిద్ధంచేయాలని అన్నారు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు ఒక సైనికుడిలా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థులను గెలిపించి మనసత్తా ఏమిటో చూపించాలి ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ సర్పంచ్ సుంకరి పండరినాథ్ గౌడ్ మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్, మాజీఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ముదిరాజ్ మంచాల మండలం మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సలాం ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహా గౌడ్



బుట్టి కృష్ణ ముదిరాజ్ మార బౌరమ్మ లక్ష్మణ్ కంబాలపల్లి, బుగ్గ రాములు, నాయకులు పంబాల బుగ్గ రాములు. మారగోని సత్యనారాయణగౌడ్, వెదిరె రమణరెడ్డి గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ మాధగోని జంగయ్యగౌడ్, మారగోని మసయ్యగౌడ్ అంతటి రాజుగౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్ రెడ్డి ఆరుట్ల గ్రామశాఖ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరమోని అశోక్ ముదిరాజ్, కావలి రమేష్, మార సురేష్ ఆర్ల శ్రీకాంత్ లచ్చగారి జంగారెడ్డి ఎన్నుదుల సురేష్ వస్పరి కుమార్ మంకు ప్రవీణ్ చీమర్ల క్రాంతి చీమర్ల శేఖర్, మహమ్మద్, అష్రఫ్, రైన ముదిరాజ్ గణేష్, నూకం బాలరాజ్, రావుల శ్రీకాంత్ ఎన్నుదుల మదు మహమ్మద్ సజీన్ తదితరులు పాల్గొన్నారు

# జీహెచ్ఎంసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు

### - గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్ వెల్లడి

**వెలుతురు, హైదరాబాద్ అక్టోబర్ 06 :**
గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జీహెచ్ ఎంసీ ఉద్యోగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేటర్ హైదరా బాద్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్ తెలిపారు. సో మవారం ఆయన మీడియాతో మా ట్లాడుతూ...జీహెచ్ఎంసీ, శాశ్వత ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించా రు. ఈ కాలనీ చల్లూరు ప్రాంతంలో 220 ఎకరాల స్థలంలో నిర్మించను న్నామని, ప్రతి గజం ధర రూ. 3,99 9గా నిర్ణయించామన్నారు. డీటీసీపీ అనుమతులు పొందే ప్రక్రియలో ఉ న్నాం, అన్ని పనులు వేగంగా కొన సాగుతున్నాయని తెలిపారు. జీహె చ్ఎంసీ శాశ్వత ఉద్యోగులు కేవలం రూ.1 చెల్లించి సభ్యత్వం పొందవ చ్చని వివరించారు. ల్యాండ్‌ను ప్ర త్యక్షంగా చూపించడానికి ఏర్పాట్లు చేస్తామని




పేర్కొన్నారు. అతను ఇం కా, ఇతర శాఖల ఉద్యోగులకు ఇప్ప టికే కాలనీలు ఉన్న నేపథ్యంలో, ఇ ప్పుడు జీహెచ్ఎంసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీ ద్వారా సొంత గృహ సౌకర్యం కల్పించనున్నట్టు వెల్లడించారు.

## లియోనా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా దసరా, బతుకమ్మ వేడుకలు...



**కూకట్ పల్లి అక్టోబర్ 6 వెలుతురు:**
ఫ్రాన్స్ దేశంలో లియోనా నగరం లోని తెలుగు సంఘం మధుసూదన్ రావు మిత్రబృందం ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ విదేశాల్లోనూ మన తెలుగు పండుగలు ఎంతో ఘనంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మధుసూదన్ రావు మిత్రబృందం వివిధ రకాల పూల అలంకరణతో బతుకమ్మను తయారు చేయించి, పిల్లలు, ఆడపంచులందరూ పాల్గొనేలా చేసి దసరా పాటలతో, నృత్యాలతో కన్నుల పండువగ కొనసాగిందని అన్నారు. అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన పాస్టర్ ప్రశాంత్‌ను పరామర్శించిన మాజి ఎంపిటిసి దేశెట్టి పాటిల్

### త్వరగా కోలుకొని భక్తుల మధ్య రావాలని ఆకాంక్ష...



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
సంగారెడ్డి జిల్లా శాసనసభ పరిధి న్యాల్కల్ మండలంలోని హద్నూర్ గ్రామ సమీపంలో గల పులిలొంక చర్చి ఫస్టార్ ప్రశాంత్ ఇటీవల కారులో ప్రయాణిస్తూ ప్రమాదనికి గురై హైదరాబాద్ నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విష యాన్ని తెలుసుకున్న జేకే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థా పక చైర్మన్, మాజి ఎంపిటిసి బొమ్మ దేశెట్టి పాటిల్ సోమవారం నాడు సాయంత్రం ఆసుపత్రికి వెళ్లి పాస్టర్ ప్రశాంత్ యోగ క్షేమలను అడిగి తెలుసుకుని, చికిత్స అందుతున్న తీరుతెన్నులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద గాయాల నుండి త్వరగా కొలుకొనే అవకాశం ఉందని, దానిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, త్వరలోనే భక్తుల మధ్యలోకి రావాలని మాజి ఎంపిటిసి దేశెట్టి పాటిల్ ధైర్యాన్ని ఇచ్చారు. వారితో పాటు మాజి సర్పంచ్ తుంకుంట రాజు, సీనియర్ నాయకులు బాల్ రాజ్, వసంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మహాంకాళీ ఆలయంలో తలసాని ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్, అక్టోబర్ 6 వెలుతురు:**
తన జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తనెత్తు తులభారం సమర్పించారు. ఆలయ పురోహితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందచేశారు. అనంతరం గులాబీ నేతలు, కార్యకర్తలు, అభిమాను లు, మిత్రుల సమక్షంలో కేక్ కట్ చేసారు. తన జన్మదిన వేడుకలు నిరాడంబరంగా జరుపుకొంటు న్నట్లు తెలిపిన ఆయన పేదలకు అన్నదానాలు, వృద్ధాశ్రమాలూ, అనాధ శరణాలయాలలో పండ్ల పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలు చేయాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులకు సూచించారు

# ఖబర్దార్ బీసీల వ్యతిరేకుల్లారా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కు అడ్డు పడితే భౌతిక దాడులకు సైతం వెనుకడాబోం

### అనంతుల రామ్మూర్తి గౌడ్, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్, పి బడే సాహెబ్ ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు గాను వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో హైకోర్టులో కేసులు వేసి బీసీల రిజర్వేషన్లకు అడ్డు తగులుతున్న వారు ఎవరినైనా సరే సహించబోమని ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమని అన్నారు ఒక రెడ్డి కులస్తుడు ఏమో రిజర్వేషన్లు ప్రకటిస్తాడు ఇంకొక రెడ్డి కులస్తుడేమో రిజర్వేషన్లకు కేసులు వేసి అడ్డుపడతారు ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తున్నాం 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో గ్రామీణ స్థాయి నుంచి మొదలుకొని ఢిల్లీ స్థాయి వరకు అన్ని పదవులలో తిష్ట వేసి అన్ని రంగాలలో దోచుకుని అన్ని



రకాలుగా ఈరోజు స్థిరపడి ఆర్థిక శక్తితో, రాజకీయ శక్తితో ,ప్రతి ఒక్కరి జీవితాలతో ఆటలాడుకుంటున్న అగ్రవర్ణాలు మీ రోజులు దగ్గర పడ్డాయని గుర్తుపెట్టుకోవాలి అని హెచ్చరించారు. కల్లబుల్లి మాటలు చెప్పి, డబ్బు ఆషా చూపి,చిన్నా చితక పదవులు ఆశ చూపి మాలో మాకే లొల్లిలు పెట్టి మాలో మాకే గొడవలు పెట్టి ఒకరికి ఒకరికి పడకుండా చేస్తూ మా ఓట్లు వేయించుకొని గద్దెనెక్కి ఈరోజు మా జీవితాలతో ఆడుకుంటున్న అగ్రకులకు ఇకనైనా మార్పు రావాలని లేనిపక్షంలో ఓటు విలువ గురించి పదవి విలువ గురించి చైతన్యమైతున్న ఎస్సీ ఎస్టీ బీసీలను ఇకపై మోసం చేయలేరని రాబోయేది బహుజనుల రాజ్యమని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రేపు 8వ తారీఖు నాడు కనుక 42 శాతం రిజర్వేషన్లకు హైకోర్టులో వ్యతిరేకంగా హైకోర్టు తీర్పిస్తే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని రాష్ట్రంలో ఉన్న అన్ని విద్యా వైద్య రాజకీయ రంగాలలో స్థిరపడ్డ ప్రతి బీసీలు కూడా పెండౌన్ చేసి రోడ్డుపైకి రావాలని పిలుపునిచ్చారు, 42 శాతం రిజర్వేషన్లకు కనుక అడ్డు తగిలితే ఈ రాష్ట్రంలో మరొక తెలంగాణ ఉద్యమాన్ని చూడాల్సి ఉంటుందని దేశవ్యాప్త ఉద్యమానికి సైతం ఇక ఈ తెలంగాణ నుంచే మొదలుపెడతామని రామ్మూర్తి గౌడ్, పడేసాబ్ డిమాండ్ చేశారు

## ప్రజల కోసం పోరాడే సిపిఐ పార్టీ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించండి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 06**

మండల కేంద్రంలో సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం రచ్చ యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తులు అవగాహన ప్రకారం ఉంటాయని సిపిఐ పార్టీ ఎల్లప్పుడు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక త్యాగాలు చేసిందని, పదవులు కూడా త్యాగం చేసిందని కావున ప్రజలందరూ గమనించి సిపిఐ పార్టీ అభ్యర్థులను ఎంపీటీసీలుగా, సర్పంచ్,,వార్డ్ నెంబరులు గా గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి. నరసింహ, సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సహాయ కార్యదర్శి కళ్ళెం రామచంద్రం,సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, వీరమల్ల ముత్తయ్య, భగవంత గంగాపురం వెంకటయ్య ,గాలయ్య, ఊట్కూరి కృష్ణ , కళ్ళెం జగన్నాథం, శివరాత్రి సమ్మయ్య ,పెండం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లి ఉమ్మడి జిపిఓగా శంకర్ బాధ్యతల స్వీకరణ



**వెలుతురు, చారకొండ అక్టోబర్ 06:**
చారకొండ మండలంలోని జూపల్లి ఉమ్మ డి గ్రామానికి నూతన గ్రామపాలన అధికారిగా (జిపిఒ) ఎడ్ల శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అచ్చంపేట మున్సిపల్ లో జూనియర్ అసి స్టెంట్ గా విధులు నిర్వహించారు. గ్రామపాలన అధికారి బాధ్యతల స్వీకరణలో భాగంగా జూపల్లి ఉమ్మడి (జేపల్లి) గ్రామపాలన అధికారిగా నియమించడంతో సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## కురేల్ల అరుణ్ చంద్ ను గాయపరిచిన వారిపై చట్టరీత్యా తీసుకోవాలని కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు...

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 06:**
కరీంనగర్ పట్టణం మారుతి నగర్ చెందిన కురేల్ల అరుణ్ చంద్ ను అకారణంగా కొట్టి గాయపరిచిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అరుణ్ తండ్రి కూరెల్ల పరంధాములు సోమవారం రోజున కరీంనగర్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం జరిగిన శోభాయాత్ర సందర్భంగా తన కుమారుడిని అజయ్, శివ, దశరథం, బ్రహ్మం, గంగాధర్ తో పాటు మరికొందమంది వ్యక్తులు ఆ కారణంగా కొట్టి, రక్త గాయాలు అయ్యేవిధంగా తీవ్రంగా గాయపరిచారని పరంధాములు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం తన కుమారుడు తీవ్ర గాయాలతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నాడని తెలిపారు. తాను ఇచ్చిన కంప్లైంట్ పై పోలీసులు తగిన విచారణ జరిపి , అరుణ్ ను గాయపరిచిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పరంధాములు ఈ సందర్భంగా కోరారు.

## మార్వాడీల మోసాలపై పోరుకు జేపీసీ ఏర్పాటు

**- డా. పిడమర్తి రవి జేపీసీ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవ ఎన్నిక...**

**- జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి. రాములు నేత ఎన్నిక...**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
తెలంగాణ రాష్ట్రంలో మార్వాడీ నకిలీ వ్యాపారాలకు, మోసాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు ఒక్కటిగా ఎదుగుతున్నాయి. ఈ నేపథ్యంలో "మార్వాడీ గో బ్యాక్ జేపీసీ"ను ఏర్పాటు చేస్తూ డా. పిడమర్తి రవిని జేపీసీ రాష్ట్ర అధ్యక్షునిగా (ఛైర్మన్‌గా) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి. రాములు నేతను జహీరాబాద్ నుంచి నియమించారు. ఈ సందర్భంగా జేపీసీ రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి ఉత్తర భారతీయుల నకిలీ మోసాల వ్యాపారాలను ఎండగట్టి, రాష్ట్ర వ్యాపారులను, ప్రజలను చైతన్యపరచే కార్యక్రమాలను చేపడతామని డా. రవి తెలిపారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజా సంఘాల ప్రతినిధులు, వ్యాపారులు, చేతివృత్తిదారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొయినాబాద్ చెర్రీవోక్స్ ఫాంహౌస్ కేసు

**- ట్రాప్‌హౌజ్ పార్టీపై పోలీసుల ముమ్మర దర్యాప్తు**

**వికారాబాద్,అక్టోబర్6 ( వెలుతురు):**
మొయినాబాద్ చెర్రీవోక్స్ ఫాంహౌస్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ట్రాప్ హౌస్ పార్టీలో ఆర్గనైజర్లు, డీజే ప్లేయర్లు సహా 65 మంది పాల్గొన్నట్లు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారంతో 59 మంది యువతి, యువకులు పార్టీకి వచ్చారు. 22 మంది మైనర్లు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ఇషాన్ అనే యువకుడు పార్టీ నిర్వహించినట్లుగా గుర్తించారు. ఇషాన్ ఇటీవలే కెనడా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్‌హౌస్ పేరిట పేజీ క్రియేట్ చేశాడు. అక్టోబర్ 4న చెర్రీవోక్స్ ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహించాడు. ఒక్కరికైతే రూ.1,600, జంటగా వస్తే రూ.2,800గా ధర నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఇది చూసిన మైనర్లు పార్టీకి సిద్ధమయ్యారు. మత్తులో జోగుతున్న సమయంలో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న వారికి నిర్వహించిన డ్రగ్ పరీక్షలో ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్టు నిర్ధరణ అయింది. ఆరుగురు నిర్వాహకులను, 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మొయినాబాద్ ఠాణాలో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన ఫిర్దోస్‌ను ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
సంగారెడ్డి జిల్లా, ఝరసంఘం మండలం బొప్పన్పల్లి గ్రామానికి చెందిన ఫిర్దోస్ అనే విద్యార్థిని, బుచినెల్లిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ (TMREIS) లో చదివి, NEETలో అర్హత సాధించి సిద్దిపేటలోని సురభి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఉచిత సీటు పొందిన సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు విద్యార్థినిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, "2021లో బుచినెల్లి మైనారిటీ గురుకులం ప్రారంభించిన సమయంలో 'ఫ్యూచర్‌లో ఏం అవుతావు





అమ్మా?' అని అడిగినపుడు ఫిర్దోస్ 'డాక్టర్ అవుతాను' అని చెప్పింది. నేడు ఆ కలను నిజం చేసింది. ఇది ఆమె కృషి, పట్టుదల ఫలితం" అని అన్నారు. ఇటీవల NEETలో అర్హత సాధించి, అదే బుచినెల్లి మైనారిటీ గురుకులం నుంచి మరో 8 మంది, అల్గోల్ మైనారిటీ గురుకులం నుండి 7 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు పొందడం ఎంతో గర్వకారణమని తెలిపారు. "తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ గారి దూరదృష్టితో ప్రారంభమైన గురుకుల విద్యా వ్యవస్థ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆశాకిరణంగా మారింది" అని హరీష్ రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 290 గురుకులాలు మాత్రమే ఉన్నప్పుడు, కేసీఆర్ ప్రభుత్వం వాటిని 1020కి పెంచిందని, మైనారిటీ గురుకులాల సంఖ్యను 2 నుంచి 204కి పెంచిన దృష్టిని ఆయన ప్రశంసించారు. ఇంటర్ చదువు గురుకులాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల పది తరగతి తర్వాత విద్యార్థులు చదువు మానేసి పనులకు వెళ్లాల్సి వచ్చేదని, దాన్ని మార్చేందుకు అన్ని గురుకులాలను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయడం, అలాగే 30 డిగ్రీ కాలేజీలను ప్రత్యేకంగా ప్రారంభించడం, దేశంలో తొలిసారిగా రెసిడెన్షియల్ లా కాలేజీ స్థాపించడంలాంటివి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల చర్యలని గుర్తు చేశారు. "పేదల విద్యపై పెట్టే ఖర్చును కేసీఆర్ గారు 'క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్'గా అభివర్ణించారు. విద్యపై పెట్టే పెట్టుబడి వ్యక్తిగతంగా ఒక్క వ్యక్తికే కాకుండా, ఒక తరం జీవన విధానాన్ని మార్చగలదు" అని అన్నారు. "మీరు మంచి స్థాయికి చేరుకున్న తర్వాత సమాజానికి ఏదైనా విధంగా తిరిగి ఇవ్వాలన్న భావనతో ముందుకు సాగాలి. మీ ఊరు, గురుకులం, పేదవర్గాలకు సహాయపడాలన్న సంకల్పం ఉండాలి" అని విద్యార్థులకు హరీష్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఝరసంఘం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, గ్రామ పార్టీ అధ్యక్షులు నాగన్న, ఇతర స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పార్టీ మారిన నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు...

**- వడ్డి గ్రామంలో బీజేపీ నాయకుల సమావేశం**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి...**

**- మండల మాజీ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్...**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్ కల్ మండలం వడ్డి గ్రామంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్, మండల మాజీ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో పార్టీ మారిన నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "కితకితకో పార్టీ మారుతూ, ప్రజలను మభ్యపెట్టే నాయకులను ప్రజలే గమనిస్తున్నారు. యువత కూడా ఇదంతా చూస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారు. ఎంపీటీసీ, సర్పంచ్ స్థాయిల నుంచి జడ్పీటీసీ వరకు అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేసి విజయం సాధించాలి. ఎవ్వరూ వెనకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి రాహుల్, పలింకార్ నర్సప్ప, సచిన్, లక్ష్మణ్, షేర్ అలీ, సంజు కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ మారే నాయకుల వల్ల నష్టమేమీ లేదు

**- బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**
బీజేపీ నుంచి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) పార్టీలోకి చేరిన కొంతమంది నాయకులపై బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ ఘాటుగా స్పందించారు. అలాంటి నేతల వల్ల పార్టీకి ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, "ఈ నాయకులు పార్టీలకు కట్టుబాటుతో పనిచేసే వ్యక్తులు కారన్నారు. గతంలో ఎమ్మెల్యే ఎన్నికల్లో ఒక పార్టీ, ఎంపీ ఎన్నికల్లో మరో పార్టీ.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మరో పార్టీకి వెళ్లడం చూస్తుంటే, వీరి రాజకీయ విధానం స్వలాభంపైనే ఆధారపడినదని స్పష్టంగా కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. "ఇటువంటి వారు పార్టీకి నిబద్ధత చూపక, అధికార దాహంతో తరచూ పార్టీలను మార్చడం ద్వారా తాము ఎంతవరకు ప్రజాసేవలో ఉన్నారో చెప్పకనే చెప్పారు" అని మల్లేష్ విమర్శించారు. అలాగే, టీఆర్ఎస్‌లోకి వెళ్లిన నేతల స్థానాల్లో బీజేపీ మరింత బలంగా నిలబడతుందని, పార్టీ కార్యకర్తలంతా



గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. "ప్రజలు పార్టీకి వున్న నిబద్ధతను, నాయకుల నిజమైన సేవాభావాన్ని గమనిస్తున్నారని... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని నమ్మకముందని మల్లేష్ గంగ్వార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాల్కల్ మండల బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాల వల్లనే టమోటా ధరలపై ప్రభావం

**- రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్న**

**అమరావతి,అక్టోబర్ 6( వెలుతురు):**
టమోటా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. రాప్తాడు మార్కెట్ లో ఆదివారం టమోటా ధరలు గరిష్టంగా రూ.18, కనిష్ఠంగా రూ.9, మోడల్ ధర రూ.12 గా ఉన్నాయి. టమోటా రేటు భారీగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారిని ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. వర్షాల కారణంగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు టమోటా ఎగుమతి తగ్గిందని, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో టమాటా అమ్మకాలు మందగించాయని అచ్చెన్న పేర్కొన్నారు. పత్తికొండ మార్కెట్‌కు 30 నుంచి 40 మెట్రిక్ టన్నులకు మించి టమోటా రాదని, దసరా సెలవులు కావడంతో మరొక 10 టన్నులు అదనంగా వచ్చిందని అన్నారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామన్నారు. పత్తికొండ మార్కెట్‌లో టమోటాలు సేకరించి చిత్తూరు ప్రాసెసింగ్ యూనిట్‌కి 10 మెట్రిక్ టన్నులు, రైతు బజార్లకు 15 మెట్రిక్ టన్నులు పంపిస్తామన్నారు. టమోటాలకు ట్రెండింగ్ ధరను బట్టి ప్రస్తుతం మంచి ధర లభిస్తోందన్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అన్ని విధాలుగా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాప్తాడు మార్కెట్‌లో నిన్న టమాటా ధరలు గరిష్ఠం రూ.18 కాగా.. కనిష్ఠం రూ.9గా ఉందన్నారు. 30 నుంచి 40 మెట్రిక్ టన్నులకు మించి కర్నూలు జిల్లాలోని పత్తికొండ మార్కెట్‌కు సరకు రాదన్నారు. దసరా సెలవుల దృష్ట్యా మరో 10 టన్నుల టమాటా అదనంగా చేరిందని తెలిపారు. రోడ్లపై రెండో గ్రేడ్ క్వాలిటీ టమాటాలు వేసి గందరగోళం సృష్టించారన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు వర్షాల వల్ల ఎగుమతి తగ్గిందన్న ఆయన.. ఎడతెరిపిలేని వర్షాలతో టమాటా అమ్మకాలు మందగించాయని తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బిజెపి కసరత్తు

**- నేడు అభ్యర్థిని ఖరారు చేసేందుకు నేతల భేటీ**

**హైదరాబాద్,అక్టోబర్6 ( వెలుతురు):**
భాజపా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ మంగళవారం సమావేశం కానుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఈ సమావేశంలో ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజవర్గం నుంచి సమాచారం సేకరించారు. ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపించనుంది. బుధవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేసులో జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, లంకల దీపక్ రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేసి మూడో స్థానానికే పరిమితమయ్యారు. ప్రస్తుతం భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు ఉప ఎన్నిక టికెట్ దక్కుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయనకు టికెట్ ఇవ్వని పక్షంలో జూటూరు కీర్తి రెడ్డికి టికెట్ దక్కే అవకాశముందని సమాచారం. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న లంకల దీపక్ రెడ్డి, జూటూరు కీర్తిరెడ్డిలో ఒకరు జూబ్లీహిల్స్ ఉపపోరులో నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓవైసీపై పోటీ చేసి ఓడిపోయిన మాధవి కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఇకపోతే అభ్యర్థి ఎంపికతో పాటు, గెలిపించుకోవడం బిజెపికి ముఖ్యంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాంచంద్రరావుకు సవాల్‌గా మారనుంది. త్రీమెన్ కమిటీ తీసుకునే నిర్ణయం ఆధారంగా ఎంపిక జరుగనుంది.

# ఎన్నిక లోపే అభివృద్ధి పనులు పూర్తి

## షేక్‌పేటలో సిసి రోడ్డు పనులకు మంత్రి వివేక్ శంకుస్థాపన

**హైదరాబాద్,అక్టోబర్ 6( వెలుతురు):**
ఎన్నికలతో సంబంధం లేకుండా నెల రోజుల్లోనే జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ లోని షేక్ పేట తేజా కాలనీలో సీసీ రోడ్డు, డ్రైయిన్స్ పనులకు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి . ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించడంతో మంత్రితో కేక్ కట్ చేయించారు స్థానికులు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వివేక్ వెంకటస్వామి.. నెల రోజుల ముందు సీసీ రోడ్డులు లేవని స్థానికులు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు సాంక్షన్ చేయించా. ఇక్కడ ప్రజల కోసం రూ. 40 లక్షలతో మొదలు పెట్టాం. ఎన్నికలతో సంబంధం లేకుండా నెలలో పనులు పూర్తి చేస్తాం. గతంలో బీఆర్ఎస్ ఓట్లు వేసుకొని గాలికి వదిలేసింది. 10 ఏళ్ళలో బీఆర్ఎస్ ఎలాంటి పనులు చేయలేదు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల నుంచి మంచి ఫీడ్ బ్యాక్ ఉంది.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారు. ప్రజలు అందరు పనులు చేయిస్తున్నామని సంతోషంగా ఉన్నారు. ఇంకా మూడేళ్లు మేమే అధికారంలో ఉంటాం. ముందు ఉండి అన్ని అభివృద్ధి పనులు చేయిస్తాం అని అన్నారు. మరో వైపు జూబ్లీహిల్స్ బైపోల్ కు షెడ్యూల్ ప్రకటించింది ఈసీ. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా.. 14న కౌంటింగ్ జరగనుంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత పోటీపడుతుండగా.. కాంగ్రెస్,బీజేపీ ఇంకా అభ్యర్థులన్ను ÷నైల్ చేయలేదు.

## ఎనికేపాడులో అగ్నిప్రమాదం

**- ఎలక్ట్రానిక్ పరికరాలు అగ్నికి ఆహుతి**

**- సుమారు రూ.5 కోట్లకు పైగా ఆస్తినష్టం**

**విజయవాడ,అక్టోబర్ 6( వెలుతురు):**
విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎనికేపాడులోని ఓ ప్రముఖ కంపెనీకి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలు నిల్వచేసే గోదాంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంటలు ఎగిసిపడితుండటంతో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు అగ్నికి ఆహుతి అయినట్లు తెలుస్తోంది. భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ పక్కల ప్రాంతాలను పొగ కమ్మేసింది. పొగ ధాటికి స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. స్థానికులను ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి దూరంగా పంపించివేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం



సృష్టించింది. వెంటనే నిర్వాహకులు అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందటంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు ఫైర్ సిబ్బంది. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.5 కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగి ఉంటుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

# ఎంఐఎం మాకు ఫ్రెండ్లీ పార్టీ

**- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తాం**

**- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్,అక్టోబర్ 6( వెలుతురు):**
జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు ఫ్రెండ్లీ పార్టీ అని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం తమకు పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయం తమదే అని పీసీసీ చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈరోజు షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరగనున్నట్లు ఈసీ వెల్లడించింది. మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. 'రెండు మూడు రోజుల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి పేరు ఖరారవుతుంది. అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడుతున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితులను బట్టి మిత్రపక్షాలకు టికెట్లు ఇస్తాం. సీపీఎం, సీపీఐ, జనసమితి అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది. డిసెంబర్ నెలాఖరు వరకు కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తాం. బీసీ రిజర్వేషన్‌పై మేం పడే తపన ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కామారెడ్డిలో బహిరంగ సభ ఉంటుంది. అక్టోబర్ నెలాఖరులో కామారెడ్డి సభ ఉంటుంది' అని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చెప్పారు.

# నటుడు విజయ్ కారుకు ప్రమాదం

**- జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఘటన**



**జోగులాంబ గద్వాల,అక్టోబర్ 6( వెలుతురు):**
హీరో విజయ్ దేవరకొండ కారుకు ప్రమాదం జరిగింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి దగ్గర ముందు వెళ్తోన్న బొలెరో వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో విజయ్ కారు ఢీ కొట్టింది. దీంతో విజయ్ దేవరకొండ కారు పాక్షికంగా దెబ్బతింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విజయ్ పుట్టపర్తి వెళ్లి తిరిగి హైదరాబాద్ తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విజయ్ ఆదివారం పుట్టపర్తిని దర్శించుకున్నారు. తిరిగి హైదరాబాద్ వచ్చేటపుడు జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి శివారులోని వరసిద్ధి వినాయక పత్తి మిల్లు దగ్గరకు రాగానే విజయ్ కారు ప్రమాదానికి గురైంది. విజయ్ దేవర కొండ డ్రైవర్ అందే శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన తర్వాత మరో కారులో విజయ్ దేవరకొండ హైదరాబాద్ కు వెళ్లారు. విజయ్ ,రష్మిక నిశ్చితార్థం వార్తలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో పుట్టపర్తిలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహా సమాధిని దర్శన సమయంలో విజయ్ చేతికి ఉన్న రింగ్ వైరల్ అవుతోంది. విజయ్,రష్మిక ఎంగేజ్ మెంట్ రింగ్ అని అందరు చర్చించుకుంటున్నారు. విజయ్ తన నిశ్చితార్థం తర్వాత తొలిసారిగా బహిరంగ ప్రదేశంలో కనిపించడం, అదీ తన కుటుంబ సమేతంగా ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లడం... ఈ రెండు సంఘటనలూ అభిమానుల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఆయన కుడిచేతి ఉంగరం వేలికి మెరుస్తున్న రింగ్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ రింగ్ బంధమే విజయ్-రష్మిక నిశ్చితార్థానికి బలమైన ఆధారాన్ని ఇస్తోందని నెటిజన్లు గట్టిగా నమ్ముతున్నారు

# జూబ్లీహిల్స్‌లో ఓటర్ ఐడి కార్డులు పంపిణీ

**- ఇసికి ఫిర్యాదు చేసిన ఎంపి రఘునందన్**



**హైదరాబాద్,అక్టోబర్ 6( వెలుతురు):**
ఎన్నికల కమిషన్‌కు ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు చేశారు. ఓటర్ కార్డులను కాంగ్రెస్ నేతలు పంపిణీ చేయడంపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రఘునందన్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతలు ఓటర్ ఐడీ కార్డులు పంచిపెట్టే దుకాణం పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ చేతుల్లోకి రావాల్సిన ఓటర్ కార్డులు.. కాంగ్రెస్ నేతల చేతుల్లోకి ఎలా వెళ్లాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. బహిరంగంగా ఓటర్ కార్డులను పంచుతుంటే ఎన్నికల కమిషన్, ఉఊఓఅ కమిషనర్లు ఎందుకు మాట్లాడటం లేదని ఎంపీ రఘునందన్ నిలదీశారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులను పంచుతున్న నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా పోటీకి ఎలా అర్హుడు అవుతాడని రఘునందన్ మండిపడ్డారు. 'నవీన్ యాదవ్‌కు ఓటర్ ఐడీ కార్డులు ఎవరిచ్చారు, ఉఊఓఅ కమిషనర్ ఇచ్చారా..? ఎన్నికల కమిషన్ ఇచ్చిందా..?' అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ÷ూఎఖీ(÷ఔఇతిజీ ఎనిబిఉనిబతిలఉ ఖీఉలతిబతినీని) చేస్తామంటే గగ్గోలు పెడుతున్న మేధావులు ఇలాంటి వాటి మీదా స్పందించాలని తెలిపారు. ÷ూఎఖీ చేస్తామంటే ఓట్ల చోరీ అంటున్నారని, ఇది ఐడీ కార్డుల చోరీనా..? అని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ ఐడీ కార్డులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ ఐడీ కార్డుల పంపిణీపై వెంటనే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో ఎండావాన పరిస్థితి

**- పలు చోట్ల ఉదయం వర్షం**

**హైదరాబాద్,అక్టోబర్6 ( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వింత పరిస్థితి నెలకొంది. ఒకే సారి ఎండ, వాన జనాల్ని ఆశ్చర్యపరిచాయి. ఓ ప్రాంతంలో ఎండ, మరో ప్రాంతంలో వర్షం కురిసింది. ఉదయం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సాధారణంగా వాన పడుతున్నపుడు ఎండ ఉండదు. ఒక వేళ ఎండ కొట్టినా కొన్ని నిమిషాల్లోనే మబ్బులు కమ్మేస్తాయి. కానీ, సోమవారం ముందెన్నడూ లేని విధంగా ఓ వైపు వాన పడుతుంటే మరో వైపు ఎండకాసింది. అది కూడా గంటకు పైగా ఈ వింత పరిస్థితి చోటు చేసుకుంది. దీంతో జనం ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యాన్ని యువత తమ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. మరోమారు గ్రేటర్ హైదరాబాద్ వర్షంతో తడిసి ముద్దయింది. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, మణికొండ, దిల్‌సుఖ్ నగర్, యూసఫ్ గూడ, అబిడ్స్, ఖైరతాబాద్, బోరబండ తదితర ప్రాంతాలలో వర్షం పడుతోంది. మరోవైపు.. యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. రుద్రవెల్లి వద్ద లో లెవెల్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద ప్రవహిస్తోంది. మూసీ వరద ప్రవాహంతో భూదాన్ పోచంపల్లి - బీబీనగర్ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి.

# సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

**హైదరాబాద్, అక్టోబర్ 6( వెలుతురు):**



హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఎంత చెప్పినా తక్కువే. మెట్రో రన్ అవుతున్నా, ఎక్కడిక్కక్కడ ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ చిక్కులు నగరవాసులకు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు పరిస్థితి మరింత హారిబుల్‌గా ఉంటుంది. అందుకే దీనికి పరిష్కారంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్యారడైజ్ కూడలి నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోజురోజుకు చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణ కారణంగా శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే దీని నుంచి ఉపశమనం కోసం మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించారు. కానీ అది ముందుకు కదలడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నార్త్‌సిటీపై ఎక్కువ ఫోకస్ చేశారు. ప్యారడైజ్ సర్కిలల్ నుంచి మేడ్చల్, సమీర్‌పేట వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ మార్గం కేలం నిత్యం ప్రయాణించే లోకల్ వాహనాలే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాణిజ్య వాహనాలకు కూడా ప్రధాన రహదారి. దీంతో సాధారణ ప్రయాణ సమయం అంచనాలకు మించి పెరుగుతోంది. ఈ మార్గంలో ఉదయం, సాయంత్ర వేళల్లో ట్రావెల్ చేయాలంటే చాలా ఇబ్బందింగా ఉంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, వర్షాలు పడితే సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి. వీటికి పరిష్కార మార్గంగానే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కారిడార్ ద్వారా నగరంలోలని అంతర్గత ట్రాఫిక్‌ను, ప్రధాన మార్గ ట్రాఫిక్‌ను వేరు చేయవచ్చు. దీని వల్ల నిరంతరాయంగా, వేగవంతైన ప్రయాణాన్ని సాధించవచ్చు. రవాణా సామర్థ్యాన్ని పెంచడం, తద్వార ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయడానికే ప్యారడైజ్ నుంచి సమీర్‌పేట వరకు ఈ కారిడర్‌ను ప్రతిపాదించారు. సాధారణంగా ఒక పెద్ద నిర్మాణ ప్రాజెక్టును చేపట్టే ముందు, సంబంధిత ఇంజినీరింగ్ విభాగం లేదా కన్సల్టెన్సీ సంస్థలు ప్రాజెక్టు డిజైన్, నిర్మాణ వ్యయం, సాంకేతిక అంశాలు, పర్యావరణ ప్రభావం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకొని రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిర్మాణ వ్యయం, నిర్మాణ సమయం, ఇంజినీరింగ్, ఆర్థికపరమైన వివరాలతో వీటిని రెడీ చేశారు. ప్రభుత్వ అనుమతి కోసం పంపించనున్నారు. ప్యారడైజ్ నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం సవాళ్లతో కూడిన టాస్క్‌గా అధికారులు భావిస్తున్నారు. భూసేకరణ, ట్రాఫిక్ మళ్లింపు, మౌళిక వసతుల కల్పన అన్నింటిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయినా సరే ఇది పూర్తి అయితే గంటల ప్రయాణం నిమిషాల్లోకి మారుతుంది. అంతే కాకుండా మేడ్చల్, సమీర్‌పేట్‌తోపాటు ఆ దారి చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇంధనం ఆదా అవుతుంది. కాలుష్యం తగ్గుతుంది. ఇది పూర్తి అయితే కచ్చితంగా హైదరాబాద్‌కు మరో మణిహారం తోడైనట్టుగా అధికారులు చెబుతున్నారు.

# జనంలోకి జనసేన



**విజయవాడ, అక్టోబర్ 6( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్నజనసేన పార్టీ, సంస్థాగత బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ దిశగా పటిష్టమైన కార్యాచరణను రూపొందించారు. కేవలం ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటమే కాకుండా, పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, రాబోయే ఐదేళ్లలో ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడానికి త్రిశూల వ్యూహం అమలు చేయాలని ఆయన తన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశం శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు పలువురు పార్టీ కీలక నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ కొన్ని కీలక అంశాలను పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడంలో భాగంగా, ప్రతి ఐదు నియోజకవర్గాలకు ఒక ఎమ్మెల్యేను ఇన్ ఛార్జ్ గా నియమించారు. ఈ ఇన్ ఛార్జ్‌లు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించడం, స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేయడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో సహాయపడటం వంటి ముఖ్య బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. కేవలం జనసేన పార్టీ బలోపేతం గురించే కాకుండా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ఇచ్చిన హామీలు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా చూడటం, పారదర్శక పాలన అందించడంలో క్రియాశీలక పాత్ర పోషించడం దీని ఉద్దేశం. ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని పవన్ సూచించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం ఈ పర్యటనల ముఖ్య లక్ష్యం.పార్టీ బలోపేతానికి పవన్ కల్యాణ్ త్రిశూల వ్యూహం రూపొందించారు. ఇది మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది. మొదటిది ప్రభుత్వపరమైన సమన్వయం.

జనసేన నేతలు, కార్యకర్తలు క్షేత్ర స్థాయి సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కేడర్ పని చేయాలి. రెండోది సంస్థాగత పటిష్టత. నియోజకవర్గాల ఇన్ ఛార్జ్‌ల నియామకం ద్వారా పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం ఇందులో ఓ భాగం. బూత్ స్థాయి కమిటీల వరకు క్రియాశీలకంగా ఉండేలా చూడాలని, యువతను, మహిళలను పార్టీలోకి ఆహ్వానించి, వారికి తగిన బాధ్యతలు అప్పగించాలని సూచించారు. మూడోది జనంలోకి జనసేన. పవన్ కల్యాణ్ స్వయంగా జిల్లాల్లో పర్యటించడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోవాలనుకుంటున్నారు. గతంలో వారాహి విజయ యాత్ర స్ఫూర్తితో మరింత విస్తృతంగా ప్రజలతో మమేకం కావడం ఈ వ్యూహంలో భాగం.ప్రభుత్వంలో కీలక బాధ్యతలు, మరోవైపు సినిమా రంగంలో కమిట్‌మెంట్ల కారణంగా పవన్ కల్యాణ్ బిజీగా ఉంటున్నారు. ఇకపై కొంత సమయాన్ని జనం కోసం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల నుంచే పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనల్లో ఆయన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, పార్టీ కార్యకర్తలతో, సామాన్య ప్రజలతో నేరుగా సమావేశం కానున్నారు. తన బాధ్యతలను సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటూ, పార్టీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దాలని పవన్ కల్యాణ్ గట్టి సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తోంది. జనసేన పార్టీని కేవలం కూటమిలో భాగస్వామిగానే కాకుండా, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును నిర్ణయించగలిగే ఒక బలమైన శక్తిగా నిలబెట్టాలనే లక్ష్యంతో పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నారు. మరి సంస్థాగత మార్పులు, క్షేత్ర స్థాయి పర్యటనలతో కూడిన ఈ సమన్వయ వ్యూహం జనసేనకు రాబోయే రోజుల్లో ఏ విధంగా ఫలితాలనిస్తుందో చూడాలి.

# చిన్నమ్మకు ఇంకా టైముందా..



**రాజమండ్రి, అక్టోబర్ 6( వెలుతురు):**
రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరికి ఇప్పట్లో పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆమె కేంద్ర మంత్రి పదవి వస్తుందని అనుకున్నారు. కానీ నర్సాపురం పార్లమెంటు సభ్యుడు శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రివర్గంలోకి అనూహ్యంగా తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీకి మాత్రం రెండు పదవులు లభించాయి. తెలంగాణలో ఎనిమిది స్థానాలను గెలవడంతో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ఏపీలో మూడు పార్లమెంటు స్థానాలు దక్కడంతో ఒకే ఒక్కరికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పటికీ పురంద్రీశ్వరికి అవకాశం లభించదన్నది ఆమెకు తెలియంది కాదు... ఎందుకంటే టీడీపీ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న గుంటూరు పార్లమెంటుసభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన కారణం. ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించే ఛాన్సులు అయితే లేవు. ఎందుకంటే పెమ్మసాని లోకేశ్ కు, చంద్రబాబుకు అత్యంత ఆప్తుడు. ఆయన అమెరికాలో ఆర్థికంగా స్థిరపడి కూడా తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీలో చేరారు. పెమ్మసాని కమ్మ సామాజికవర్గం కావడంతో ఇకపురంద్రీశ్వరికి ఆకోటాలో మంత్రివర్గంలో చోటు దక్కుతుందని రాజకీయాలు తెలిసిన వారు ఎవరూ అనుకోరు. ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరిని కేంద్ర కేబినెట్ లో ఒకే రాష్ట్రం నుంచి చేర్చుకునే అవకాశం లేదు. అందుకే పురంద్రీశ్వరికి భవిష్యత్ లోనూ కేంద్ర మంత్రి పదవి దక్కదు... ఇక జాతీయ అధ్యక్ష పదవి అనికొన్నాళ్లు పురంద్రీశ్వరి పేరు వినిపించింది. అయితే నరేంద్ర మోదీ, అమిత్ షాలు ఆ పదవిని పురంద్రీశ్వరికి అప్పగిస్తామని అనుకోలేమని పార్టీ నేతలే చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు అనేక సార్లు బీజేపీతో కటీఫ్ చెప్పి బయటకు వెళ్లడం, చంద్రబాబుకు పురంద్రీశ్వరికి స్వయానా వదిన కావడంతో జాతీయ అధ్యక్ష పదవి కూడా దక్కుతుందని అనుకోలేం. అలాగే లోక్ సభలో కూడా అత్యున్నత పదవి లభిస్తుందని ఊహాగానాలు వినిపించినా అవి అంతవరకే పరిమితమవుతాయంటారు. మొత్తం మీద చిన్నమ్మకు ఈ టర్మ్ లో మాత్రం ఎటువంటి పదవులు.. ఇటు ప్రభుత్వంలో కానీ, అటు పార్టీలో కానీ దక్కే అవకాశాలు లేవన్నది పార్టీ నేతలే బహిరంగంగా అంటున్నారు. మరి పురంద్రీశ్వరికి పదవి దక్కాలంటే వచ్చే ఎన్నికల వరకూ ఆగాల్సిందేనంటున్నారు.

## ఎస్. జి. ఎఫ్. రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు

**కరీంనగర్ అక్టోబర్ 6( వెలుతురు):**
స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠ శాలలోని ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్.జి.ఎఫ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్ 17 బాలబాలికల బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో పారమిత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న ఎమ్. తనుశ్రీ 54-57 కిలోల విభాగంలో పదవ తరగతి చదువుతున్న పి.సిస్మిత రెడ్డి 75-80 కిలోల విభాగంలో, జి. సాకేత్ రెడ్డి 75-80 కిలోల విభాగంలో బంగారు పథకాలను గెలుపొంది రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనారు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా బాక్సింగ్ సమాఖ్య వారి ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో అక్టోబర్ 10.11.12 తేదీలలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొ ననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు . ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు. ఎం. ప్రసాద్ , హనుమంతరావు. ప్రధానోపాధ్యా యులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థులను, బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణ ను అభినందించారు.

# వ్యూహం లేని ప్రచారం..

**విజయవాడ, అక్టోబర్ 6( వెలుతురు):**
వైసీపీ సోషల్ మీడియా విభాగం ప్రస్తుతం తగిన వ్యూహం లేకుండా ముందుకెళ్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆత్రుతతో, సరైన ఆలోచన లేకుండా వ్యవహరిస్తున్న కొందరు సోషల్ మీడియా కార్యకర్తల చర్యలు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ఒక శక్తివంతమైన ఆయుధంగా మారిన నేపథ్యంలో వైసీపీ దానిని సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వైసీపీ ఆవిర్భావం నుంచే సోషల్ మీడియాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. 2014 నుండి 2019 వరకు పార్టీ సోషల్ మీడియా సైనికులు ఆన్‌లైన్ వేదికలపై తీవ్రమైన ప్రచారం చేశారు. అప్పటి ప్రభుత్వం చేసిన తప్పులను వెలికి తీసి, ప్రజల్లో పార్టీకి విశ్వాసం పెంచే దిశగా కృషి చేశారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో వైసీపీ భారీ విజయాన్ని సాధించిందని చెప్పవచ్చు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియా విభాగం నియంత్రణ తప్పినట్లుగా కనిపించింది. పార్టీ ఆధీనంలో ఉన్న పేజీల్లో అసభ్య పదజాలం, అనవసర విమర్శలు, నిర్ధారణలేని సమాచారం ఎక్కువగా రావడం ప్రారంభమైంది. దీని వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతిన్నదనే అభిప్రాయం ఎక్కువగా వినిపించింది.2024 ఎన్నికల్లో వైసీపీ ఎదుర్కొన్న తీవ్ర పరాజయానికి కూడా సోషల్ మీడియా దుర్వినియోగం ఒక కారణమని అనేక రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఎన్నికల తరువాత కూడా కొందరు పాత అలవాట్లను వదలకపోవడం వల్ల పోలీసులు కేసులు నమోదు చేయడం, అరెస్టులు జరగడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ అధినాయకత్వం సోషల్ మీడియా కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి, "హద్దులు దాటొద్దు" అని హెచ్చరించినప్పటికీ, కొందరు మాత్రం అభిమానంతో, ఆవేశంతో చేస్తున్న పోస్టులు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయిఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు దీనికి ఉదాహరణలుగా నిలిచాయి. రాజధాని అమరావతి ప్రాంతంలో వర్షాల వల్ల ఏర్పడిన పరిస్థితులపై వైసీపీ సోషల్ మీడియా వర్గాలు ప్రచారం చేయగా, ఇతర రాష్ట్రాల ఫొటోలను వాడడం వల్ల విమర్శలు ఎదురయ్యాయి.

అలాగే ఆసియా కప్ సందర్భంగా క్రికెటర్ తిలక్ వర్మ (తో జగన్ ఉన్నట్లు ఒక ఫొటోను వైరల్ చేయడం తీవ్ర విమర్శల పాలైంది. అసలు ఆ ఫొటో నిజం కాదని బయటపడటంతో ప్రభుత్వం అనుకూల మీడియా వైసీపీపై ఫేక్ ప్రచారం చేస్తున్నదని దాడి చేసింది.ఈ సంఘటనల వల్ల పార్టీ సోషల్ మీడియా విభాగం సమర్థవంతంగా పనిచేయడంలో విఫలమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ అధినాయకత్వం సరైన మార్గనిర్దేశం ఇవ్వకపోవడంతో జగన్‌కి తెలియకుండానే ఆయన ప్రతిష్ఠ దెబ్బతింటోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ సోషల్ మీడియా నిర్వహణపై కఠిన నియంత్రణలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశముందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

## మిస్టర్ హరీష్ రావు మీలాగా మాటలు కాదు చేతల ప్రభుత్వం మాది

**- విద్యా, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నాం**

**- హరీష్ రావు కు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 06:**

మిస్టర్ హరీష్ రావు మీలాగా మాటలు కాదు చేతల ప్రభుత్వం మాది విద్యా, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నాం శంకుస్థాపన స్థాయిలో వదిలి వెళ్ళిపోయిన హాస్పిటల్స్ ఈ 21నెలల్లో వేగంగా నిర్మిస్తున్నాం 40వేల కోట్ల బకాయి పెట్టిపోయారు..మేము చెల్లిస్తున్నాం నిత్యం మా ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నాను.. రేయింబవళ్ళు పనులు జరుగుతున్నాయి. సనత్ నగర్ టిమ్స్ అక్టోబర్ 31 కి ప్రారంభిస్తామని ఇప్పటికే చెప్పాం. అల్వాల్ హాస్పిటల్ వద్ద 1000 మంది ఒకే షిఫ్టులో పనిచేస్తున్నారు. వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తాం, ఎల్బీనగర్ వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తెస్తాం నిమ్స్ హాస్పిటల్ 2వేల కోట్లతో నిర్మిస్తున్నాం వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం వరంగల్ హాస్పిటల్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి తెస్తాం.. ఎలక్షన్స్ వచ్చాయి కాబట్టి రాజకీయం కోసం పొలిటికల్ విజిట్స్ చేశారు. ప్రజల మేలు కోసం మేము చిత్త శుద్ధితో పనిచేస్తున్నాం..

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ ను కొట్టి వేయడం పట్ల పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హర్షం

**- హైకోర్టులో సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**



**రాజన్న సిరిసిల్ల జిల్లా వెలుతురు అక్టోబర్ 06:**

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్ద పీట వేస్తోంది రాహుల్ గాంధీ గారు ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు విద్య ఉపాధి, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాం రెడ్డి బిడ్డ అయిన రెవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లులు పాస్ చేశాము కాని గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఆ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి గత రెండేళ్లుగా పంచాయతీలకు ఎన్నికలు జరక్కపోవడంతో..నిధుల సమస్యలు ఎదరవుతున్నాయి కేంద్రం నుంచి నిధులు రావడం లేదు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది అయితే కొందరు వ్యక్తులు దాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయించారు సుప్రీం కోర్టు ఆ పిటిషన్లను కొట్టేయడాన్ని స్వాగతిస్తున్నాం హైకోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నాం ఎల్లుండి హైకోర్టు లో విచారణ ఉంది. హైకోర్టు సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం గత నోటిఫికేషన్ కు అనుగుణంగానే ఎన్నికలు జరుగుతాయి

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు 6కోట్లు ఖర్చు

**- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్**

**- జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ వెల్లడి**

**హైదరాబాద్,అక్టోబర్ 6( వెలుతురు):**




కేంద్ర ఎన్నికల సంఘం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల చేయడంతో హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని పొలిటికల్ అడ్వర్టయిజ్‌మెంట్లు తొలగిస్తున్నా మని చెప్పారు. నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దివంగత నేత మాగంటి గోపీనాథ్ మృతితో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి నవంబర్ 11న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది. జూబ్లీహిల్స్ బైపోల్‌కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ సీపీ సజ్జనార్ సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ.. ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నిర్వహణకు రూ.6 కోట్ల ఖర్చు అవుతుందని తెలిపారు. జూబ్లీహిల్స్?లో మొత్తం 4 లక్షల ఓటర్లు ఉన్నారని.. కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన ఐడీ కార్డులతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. 2025, నవంబర్ 14న యూసఫ్ గూడలోని కోట్ల విజయ్ భాస్కర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు పక్రియ చేపడతామని తెలిపారు. ఎన్నికకు సంబంధించి తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరిపడా ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయని.. ఫస్ట్ లెవెల్ ఈవీఎం చెకింగ్ కూడా పూర్తయిందని వెల్లడించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ తప్పకుండా పాటించాలని.. మీడియా కూడా ఎలాంటి ఫేక్ న్యూస్ టెలికాస్ట్ చేయవద్దని రిక్వెస్ట్ చేస్తున్నామన్నారు. అభ్యర్థులు తప్పకుండా తమపై ఉన్న కేసుల వివరాలను న్యూస్ పేపర్లు, న్యూస్ చానెల్స్‌లో పబ్లిష్ చేయాలని సూచించారు.

## ఇందిరా మహిళా శక్తి పథకం చీరల తయారీ ని పరిశీలించిన మంత్రి సీతక్క

**నేతన్నలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్న మంత్రి సీతక్క**





**సిరిసిల్ల వెలుతురు అక్టోబర్ 06:**

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం చీరల తయారీ విధానం చూడడానికి సిరిసిల్ల వచ్చాను. పన్నెండు నెలలు పని కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. దీనిపై ముఖ్యమంత్రి తో చర్చించి పూర్తిస్థాయిలో పని కల్పించడానికి ఏం చేయాలో ఆలోచిస్తాం. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాం. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మా లక్ష్యం బస్సు ప్రయాణం ఫ్రీ చేయడమే కాదు, బస్సులకు యజమానులను చేస్తున్నాం.

## మట్టి వాసనలు తెలిసిన రైతుబిడ్డ జస్టిస్ గోపాలగౌడ





కాకుండా సగటు ప్రజలకు న్యాయం చేసేందుకు గోపాలగౌడ వచ్చారని ఉద్ఘాటించారు. తన వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని ప్రశంసించారు. ఎన్నో కీలక కేసుల్లో గోపాలగౌడ ఇచ్చిన తీర్పులు చారిత్రాత్మకమని ఉద్ఘాటించారు. సోమవారం కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో పవన్ కల్యాణ్ పర్యటించారు. గోపాల గౌడ 75వ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. గోపాలగౌడ రాసిన పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. పవన్‌ని చూడటానికి అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ప్రసిద్ద కవి కుప్పలి వెంకటప్పను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భగా పవన్ మాట్లాడుతూ...పదవిలో ఉన్నప్పుడు ఎలా ఉండాలి, పదవి తర్వాత ఎవరి కోసం జీవించాలో గోపాలగౌడ ప్రత్యక్ష నిదర్శనమని కొనియాడారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడే వారి పక్షాన గోపాలగౌడ నిలిచారని ప్రశంసించారు. ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలు చేసినా ఎదురు నిలిచారని చెప్పు కొచ్చారు. జనసేన చేపట్టిన పోరాటాల్లో గౌపాలగౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు పవన్ కల్యాణ్. 'రాజ్యాంగాన్ని కాపాడే విషయంలో గోపాలగౌడ యువ న్యాయవాదాలకు దిశానిర్దేశర చేశారు. రైతులు, పర్యావరణం అనే అంశాలు నన్ను గోపాలగౌడకు దగ్గర చేసింది. మన బిడ్డల భవిష్యత్తు కోసం రాజకీయాలు చేయాలని నమ్మారు. నేను గతంలో ఓడిపోయిన సమయంలో వెన్నుతట్టి ధైర్యం చెప్పారు. కులం, సామాజిక కట్టుబాట్లను దాటి దేశ ప్రయోజనాల కోసం ముందుకెళ్లాలని గోపాలగౌడ చెప్పారు. పెన్నా పరివాహక ప్రాంతం విస్తారంగా చెరువులు ఉన్నా... ఇప్పుడు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. కోలార్, చిక్ బల్లాపూర్ ప్రాంతాల్లో ఇప్పుడు నీటిసమస్య ఉంది. ఈ సమస్యని పరిష్కరించడానికి ఏపీ నుంచి సహకారం అందిస్తాం. తన వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని.. ఎన్నో కీలక కేసుల్లో ఆయన ఇచ్చిన తీర్పులు చరిత్రాత్మకమని గుర్తుచేశారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడేవారి పక్షాన నిలిచారని.. ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడినా అడ్డుకున్నారని తెలిపారు. జనసేన చేపట్టిన పోరాటాల్లో జస్టిస్ గోపాల గౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని.. 2019లో తాను ఓడిపోయిన సమయంలో వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేసుకున్నారు. కర్ణాటకలోని మూడు జిల్లాల్లో నీటి సమస్య ఉందని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి పవన్ కల్యాణ్ ఈ సమస్య పరిష్కరించాలని కోరారు .న్యాయరంగంలో గోపాలగౌడ గొప్ప వ్యక్తి.. ఆయన పుట్టినరోజు వేడుకలకు రావటం సంతోషాన్ని ఇచ్చింది. కర్ణాటకలో చాలా తెలుగు కుటుంబాలు నివశిస్తున్నాయి. సంస్కృతి –సంప్రదాయాల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య సంబంధం ఉంది. ఏనుగుల గుంపులని కట్టడి చేసేందుకు కుంకీ ఏనుగులని కర్ణాటక ఇచ్చింది. ఏపీలో పంటపొలాలు నాశనం కాకుండా కర్ణాటక ప్రభుత్వం సహకరించింది. శ్రీశైలం దేవస్థానానికి వచ్చే కర్ణాటక భక్తులకు సౌకర్యాల విషయంలో సానుకూలంగా ఉన్నాం' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.తన జన్మదిన వేడుకలకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రావటం చాలా సంతోషంగా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.గోపాలగౌడ వ్యాఖ్యానించారు. రైతులు, యువత, మహిళల అభ్యున్నతి గురించి పవన్ కల్యాణ్ నిరంతరం ఆలోచిస్తారని ప్రశంసించారు. సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలో కూడా పవన్ కథానాయకుడేనని కొనియాడారు. కర్ణాటకలోని మూడు జిల్లాల్లో నీటి సమస్య ఉందని తెలిపారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి పవన్ కల్యాణ్ నీటి సమస్యని పరిష్కరించాలని కోరుతున్నానని గోపాలగౌడ పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులు

గాంధీజీ దైవంతో పోల్చారని గుర్తు చేశారు. పారిశుద్ధ్య కార్మికుల్ని ఎప్పుడూ చిన్నచూపు చూడొద్దని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే స్వచ్ఛ ఉద్యమం లేదు, స్వచ్ఛ ఆరోగ్యం లేదని చంద్రబాబు నొక్కిచెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛతా అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ స్వచ్ఛతను పాటించడంలో అగ్రస్థానంలో ఉన్న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు చంద్రబాబు. 69 రాష్ట్రస్థాయి, 1,257 జిల్లాస్థాయి విజేతలకు అవార్డులు అందించారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, పరిశ్రమలు, స్కూళ్లు, ఆస్పత్రులు, స్వచ్ఛాంధ్ర సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు అవార్డులు ఇచ్చారు. మొత్తంగా 21 కేటగిరిల్లో







స్వచ్ఛతా అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు.. పరిశుభ్రంగా ఉంటే మనం ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండదని చంద్రబాబు పేర్కొన్నారు. కానీ కార్మికులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటారని చెప్పారు. అందుకే వారంటే తనకు చాలా గౌరవమని స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు వారికి చేతులెత్తి నమస్కారం చేశారు. మొదటిసారి తాను ముఖ్యమంత్రి అయినప్పుడు పచ్చదనం పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు. స్వచ్ఛభారత్ ఏ విధంగా ఉండాలనే దానిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కమిటీ ఏర్పాటు చేశారని చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణపై సీఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. కంగ్రాట్స్ నారాయణ అంటూ సభాముఖంగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పేరుకుపోయిన 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఏడాదిలోనే మొత్తం క్లీన్ చేసినందుకు మంత్రి నారాయణకు, మున్సిపల్ శాఖకు అభినందనలంటూ వ్యాఖ్యానించారు. గతేడాది అక్టోబర్ 2కు రాష్ట్రంలో 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ పేరుకుపోయి ఉందని గుర్తుచేశారు. ఏం చేస్తారో తెలియదు.. కానీ వచ్చే అక్టోబర్ 2కు మాత్రం చెత్త పూర్తిగా ఎత్తేయాల్సిందే.. ఎలా ఊడుస్తారో ఊడ్చుకోమన్నానని చెప్పినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. దృఢ సంకల్పంతో పనిచేసిన నారాయణకు అభినందనలు అంటూ.. ప్రశంసలు కురిపించారు. ఈ అక్టోబర్ 2 కంటే 15 రోజుల ముందుగానే మంత్రి నారాయణ ఆధ్వర్యంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ చెత్తను విజయవంతంగా తొలగించారని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కొలుసు పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, పలువురు ఉన్నతాధికారులు, తదితరులు హాజరయ్యారు.స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన సంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వ శాఖలకు విజయవాడలో స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ స్వచ్ఛతను పాటించటంలో అగ్రస్థానంలో ఉన్న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలకు సీఎం అవార్డులు ప్రదానం చేశారు. 21 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో 69 అవార్డులు, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులు విజేతలకు అందించారు. స్వచ్ఛ మున్సిపాల్టీలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ స్కూల్స్, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్ స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమల కేటగిరీల్లో అవార్డులు ఇచ్చారు.స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు గానూ రాష్ట్ర స్థాయిలో 6 మున్సిపాలిటీలు, 6 గ్రామ పంచాయతీలు అవార్డులు అందుకున్నాయి. మంగళగిరి –తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తాడిపత్రి, బొబ్బిలి, పలమనేరు, ఆత్మకూరు, కుప్పం మున్సిపాలిటీలు సీఎం చేతుల మీదుగా అవార్డులు పొందాయి. స్వచ్ఛ గ్రామ పంచాయితీలుగా ఎంపికైన అనకాపల్లి జిల్లా చౌడువాడ, ప్రకాశం జిల్లా ఆర్ఎల్ పురం, కోనసీమలోని లోల్ల, కృష్ణా జిల్లాలోని చల్లపల్లి, కడప జిల్లాలోని చెన్నూరు, చిత్తూరు జిల్లాలోని కనమకులపల్లె సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్నాయి. స్వచ్ఛతకు పెద్దపీట వేసిన పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, స్వయం సహాయక సంఘాలకు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు అవార్డులు అందించారు.


## బద్రీనాథ్‌ను దర్శించుకున్న రజనీకాంత్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6( వెలుతురు):**
హిమాలయాల పర్యటనలో ఉన్న ప్రముఖ నటుడు రజనీకాంత్ సోమవారం బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ఆయన దేవాలయానికి వెళ్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆదివారం రిషికేష్‌ను సందర్శించిన తలైవా రోడ్డు పక్కన సాదాసీదాగా ఆహారం తింటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. సింప్లిసిటీకి మారుపేరు అంటూ అభిమానులు, నెటిజన్లు కొనియాడారు. రజనీకాంత్‌కు ఆధ్యాత్మిక చింతన ఎక్కువనే సంగతి తెలిసిందే. ఏటా ఆయన హిమాలయాలకు వెళుతుంటారు. ఇటీవల 'కూలీ'తో ప్రేక్షకులను పలకరించిన రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2' లో నటిస్తున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకుడు. 'జైలర్'లో కనిపించి మెప్పించిన ప్రముఖ నటులు మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, జాకీ ష్రాఫ్ సీక్వెల్‌లోనూ నటిస్తుండగా.. ఈసారి వారితోపాటు బాలకృష్ణ కూడా కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది.

## వైద్యశాస్త్రంలో విశేష కృషి

**- ముగ్గురికి నోబెల్ బహుమతి ప్రకటన**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 6( వెలుతురు):**
వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను మేరీ ఇ.బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకగుచీలకు ఈ ఏడాది అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం 2025 వరించింది. రోగనిరోధక వ్యవస్థకు సంబంధించిన పరిశోధనలకు గుర్తింపుగా ఈ ముగ్గురికీ అవార్డు దక్కింది. స్వీడన్‌లోని స్టాక్‌హోంలో నోబెల్ బృందం ఈ ప్రకటన చేసింది. మేరీ ఇ.బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్ అమెరికాకు చెందినవారు కాగా సకగుచీ జపాన్‌కు చెందిన పరిశోధకుడు. వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనుంది. శరీరంలో శక్తిమంతమైన రోగనిరోధక వ్యవస్థకు నియంత్రణ తప్పనిసరి. లేకపోతే.. సొంత అవయవాలపై దాడి చేసే అవకాశం ఉంది. దీన్ని నిరోధించే 'పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్'కు సంబంధించిన ఆవిష్కరణలకుగానూ ఈ ముగ్గురికి నోబెల్ లభించింది. రోగనిరోధక కణాలు సొంత శరీరంపై దాడి చేయకుండా అడ్డుకునే 'రెగ్యులేటరీ టీ సెల్స్'ను వీరు గుర్తించారు. రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, అందరికీ ఆటోఇమ్యూన్ వ్యాధులు ఎందుకు రావో అర్థం చేసుకునేందుకు వారి ఆవిష్కరణలు దోహదపడతాయని నోబెల్ కమిటీ ఛైర్మన్ ఓలె కాంపే తెలిపారు.

## మోడీ నేతృత్వంలో అభివృద్ధి పథంలో దేశం

**- శివాలిక్ నౌక జలప్రవేశం చేయించిన కేంద్రమంత్రి**




**విశాఖపట్నం, అక్టోబర్ 6( వెలుతురు):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళు తుందని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌సీఐ) యాజమాన్యం కిందకు వచ్చిన వీఎల్‌జీసీ శివాలిక్ నౌక తొలిసారిగా దేశంలోని విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. శివాలిక్ నౌకకు సర్బానంద సోనోవాల్ విశాఖ సముద్రంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత సముద్ర రవాణా వాణిజ్య రంగంలో శివాలిక్ కీలకపాత్ర పోషించనుందని సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఈ నౌక తన తొలి ప్రయాణంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పిజీ)ను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని షిప్ బిల్డింగ్ దేశాలలో భారత్ టాప్-10లో ఒకటిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి టాప్-5 దేశాలలో భారత్ ఒకటిగా ఉండాలని లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వివరించారు. దేశంలో మెరిటైం అభివృద్ధికి ప్రతి ఏటా రూ.6లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. ఆత్మనిర్బర్ భారత్‌లో భాగంగా 112 నౌకల తయారీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నెలలో నాలుగు షిప్పులకు టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామని సర్బానంద సోనోవాల్ తెలిపారు. భారత సముద్ర రవాణా రంగంలో ఇదొక మైలురాయని చెప్పారు. ఏపీలో దుగ్గిరాజపట్నం వద్ద నౌకా నిర్మాణ కేంద్రానికి డీపీఆర్ పూర్తయిందని స్పష్టం చేశారు. దుగ్గరాజుపట్నం వద్ద నౌక నిర్మాణ కేంద్రానికి కేంద్రం పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. భారతదేశ విదేశీ వాణిజ్యంలో 70 శాతం సముద్ర మార్గాల ద్వారా రవాణా చేయబడతాయని పేర్కొన్నారు. భారతీయ వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించాలనే అమెరికా చర్య అన్యాయం, అసమంజసమైనదని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ఉద్ఘాటించారు.

## రాయదుర్గంలో ఎకరా 177కోట్లు

**- వేలంలో అత్యధిక ధరకు అమ్మకం**

**హైదరాబాద్, అక్టోబర్ 6( వెలుతురు):**
టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో రాయదుర్గంలోని భూమికి రికార్డు ధర లభించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికింది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని టీజీఐఐసీ వేలం వేసింది. దీంట్లో పాల్గొన్న ఎంఎస్‌ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.6 ఎకరాల భూమిని సొంతం చేసుకుంది. ఎకరాకు రూ.177 కోట్ల చొప్పున మొత్తం రూ.1357 కోట్లకు చేజిక్కించుకుంది. మరోవైపు తెలంగాణ హౌజింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో కూడా రికార్డు ధర నమోదైంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో చదరపు గజం రూ.1.14 లక్షలు పలికింది.

# ముంబై పర్యటనలో మంత్రి లోకేశ్

**- టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో భేటీ**

**- టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ ఆహ్వానం**

**- మరిన్ని పెట్టుబడులు పెట్టాలని వినతి**



**ముంబయి, అక్టోబర్ 6( వెలుతురు):**
విశాఖ సిఐఐ సదస్సుకు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించడంతో పాటు, పెట్టుబడులను ఆకర్శించే లక్ష్యంతో ఎపి ఐటి శాఖ మంత్రి లోకేశ్ ముంబైలో పర్యటించారు. ఈ క్రమంలో టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో నారా లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో త్వరలో నిర్వహించ నున్న టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని టాటా గ్రూపు ప్రతినిధులను ఆహ్వానించారు. అలాగే, ఏపీలో జరుగుతోన్న అభివృద్ధిలో టాటా గ్రూపు భాగస్వామ్యం కావాలని, అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈవీల ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, రూఫ్‌టాప్ సోలార్ అభివృద్ధిలో కలిసి పనిచేయాలని, సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో టాటా ఎలక్సీ సెంటర్ ఏర్పాటు చేయాలని, పలు రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు ఏర్పాటు ఈ సందర్భంగా కోరారు. శ్రీసిటీలో ఈవీ భాగాలు తయారీ యూనిట్లు స్థాపించాలని కోరారు. భూమి, ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ప్రత్యేక ప్రోత్సాహకాలను సైతం ఇస్తుందని భరోసా ఇచ్చారు. శ్రీసిటీలో ఇంజినీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించాలని కోరిన ఆయన.. టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో ఓఎస్‌ఏటీ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ముంబయిలో జరిగిన ఈ భేటీలో టాటా పవర్ రెన్యూవబుల్స్ సీఈవో సంజయ్ కుమార్ బంగా, ఇండియా హోటల్స్ ఎండీ పునీత్ ఛత్వాల్, టాటా ఎలక్సి సీఈవో మనోజ్ రాఘవన్, టాటా ఆటో కాంప్ సీఈవో మనోజ్ కోల్హాత్కర్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈవో సుకరన్ సింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ రణధీర్ ఠాకూర్, టాటా కెమికల్స్ ఎండీ ఆర్.ముకుందన్, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సీఈవో వినాయక్ పాయ్, ఎస్టీ టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ సీఈవో బిమల్ ఖండేల్వాల్ పాల్గొన్నారు. అలాగే, గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్లాట్‌ఫాం ఈఎస్‌ఆర్ గ్రూప్ ఇండియా ఇన్వెస్టిమెంట్స్ అధిపతి సాదత్ షా, డైరెక్టర్ (లీజింగ్) ప్రకృత్ మెహతాతోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ముంబయిలోని తాజ్ ల్యాండ్స్ హోటల్‌లో జరిగిన ఈ భేటీలో ఏపీ సముద్ర ఎగుమతుల కోసం కంటైనర్ స్టేషన్లు, గిడ్డంగుల నిర్మాణం, పోర్టు ఆధారిత లాజిస్టిక్స్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా వారికి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# కురుపాం ఘటన ప్రభుత్వం నిర్లక్ష్యమే

**- కూటమి ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించాలి**

**- ఒక్కో కుటుంబాలకు 50 లక్షల పరిహారం చెల్లించాలి**

**- పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్**




**విజయవాడ, అక్టోబర్ 6( వెలుతురు):**
కురుపాం గిరిజన గురుకులంలో కలుషిత నీరు తాగి ఇద్దరు విద్యార్థినులు మరణించిన ఘటనపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. పాలనా వైఫల్యంతో ముక్కు పచ్చలారని బిడ్డలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 128 మంది గిరిజన బిడ్డలు ఆస్పత్రుల పాలయ్యారంటే ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమేనని విమర్శించారు. చనిపోయిన బిడ్డల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన బిడ్డల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ?గిరిజన బిడ్డలు ఏం తింటున్నారో చూసే పర్యవేక్షణ ఈ ప్రభుత్వానికి అసలే లేదని విమర్శించారు. సంక్షేమ బడుల్లో తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు కూడా లభించడం లేదని చెప్పు కొచ్చారు. గిరిజన బిడ్డల కడుపునకు బుక్కెడు అన్నం పెట్టడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి గిరిజన బిడ్డల సంక్షేమం పట్టదా అని ప్రశ్నించారు వైఎస్ షర్మిల.అత్యవసర వార్డుల్లో చికిత్స పొందుతున్న బిడ్డలకు మెరుగైన వైద్యం అందేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ ఘటన మరోచోట పునరావృతం కాకుండా ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరుపాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని రోగాలపై నెట్టి తప్పుకుందామని చూస్తే ఊరుకునేది లేదని చెప్పుకొచ్చారు. గిరిజన బిడ్డలపై కూటమి ప్రభుత్వానికి అంత చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. అవి వసతి గృహాలు కాదని.. సమస్యలకు లోగిళ్లని విమర్శించారు. ?గురుకులాల పేరు చెబితేనే బిడ్డలు వణుకుతున్నారంటే అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని షర్మిల విమర్శించారు.

# జగన్ హయాంలో కల్తీమద్యంతో ప్రాణాలు హరీ

**- జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం ఘటన మరిచారా**

**- కెజిహెచ్‌లో గిరిజన విద్యార్థులకు హోంమంత్రి పరామర్శ**



**విశాఖపట్నం, అక్టోబర్ 6( వెలుతురు):**
జగన్ హయాంలో కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రాణాలను తీశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యంతో పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లేదని ధ్వజమెత్తారు. గత జగన్ ప్రభుత్వంలో ఇద్దరు గిరిజనులు డిప్యూటీ సీఎంలు అయ్యారని... కానీ కనీసం ఒక్కసారైనా ఆశ్రమ పాఠశాలలను సందర్శించారా..? అని ప్రశ్నించారు. కానీ ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. సోమవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మన్యం జిల్లా గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థులను అనిత పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు హోంమంత్రి. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. వైద్యుల నిపుణులతో ఒక కమిటీ వేశామని.. సమగ్రమైన విచారణ జరుగుతోందని చెప్పుకొచ్చారు. పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంత్రి సంధ్యారాణి ఆదివారం పరామర్శించారని తెలిపారు హోంమంత్రి అనిత. కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వ్యాఖ్యానించారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేకమైన దృష్టి పెట్టారని చెప్పుకొచ్చారు. ఎప్పటికప్పుడూ అధికారులు కూడా అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పరిశీలిస్తున్నారని వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలో మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# జూబ్లీహిల్ టిక్కెట్ బిసికే దక్కుతుంది

**- మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం**



**న్యూఢిల్లీ,అక్టోబర్ 6( వెలుతురు):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో వందశాతం బీసీకే సీటు వస్తుందనే నమ్మకం తనకు ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే పర్యటన చేస్తున్నట్లు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేశ్ గెలిచారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఓటు వేస్తారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తోందని పొన్నం ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధికి పదేళ్లుగా దూరమైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సానుభూతి పేరిట మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబాన్ని రోడ్డు మీద పడేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. షెడ్యూల్ కూడా రావడంతో అభ్యర్థిని ప్రకటించి ప్రచారంలోకి వెళతామన్నారు. ఇదిలావుంటే 42 శాతం రిజర్వేషన్లపై సుప్రీంలో సోమవారం విచారణ జరిగింది. తెలంగాణ తరఫున సింఘ్వీ , దవే వాదనలు వినిపించారు. ఈ క్రమంలో తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది

## ములకలపల్లి కల్తీమద్యం కేసు

**- ఇబ్రహీం పట్నంలో భారీగా కల్తీ మద్యం పట్టివేత**



**చిత్తూరు, అక్టోబర్ 6( వెలుతురు):**
ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోన్న ములకల చెరువు కల్తీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం పట్టుబడింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, టీడీపీ నేత అద్దేపల్లి జనార్ధన్ రావుకు సంబంధించిన గోడౌన్‌లో పెద్ద మొత్తంలో కల్తీ మద్యం గుర్తించారు ఎక్సైజ్ శాఖ అధికారులు. ములకల చెరువు కల్తీ మద్యం కేసులో నిందితులైన జనార్ధన్ రావు సోదరుడు జగన్ మోహన్ రావు, జనార్ధన్ రావు అనుచరుడు కట్టా రాజు ఇచ్చిన సమాచారంతో 2025, అక్టోబర్ 6న జనార్ధన్ రావు గోడౌన్‌లో భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు ఎక్సైజ్ శాఖ అధికారులు. తనిఖీల్లో భాగంగా జనార్ధన్ రావు గోడౌన్‌లో భారీగా నకిలీ మద్యం గుర్తించారు అధికారులు. అలాగే నకిలీ మద్యం బాటిల్స్‌కు లేబుల్స్, సీలింగ్ చేసే మిషన్లు సీజ్ చేశారు అధికారులు. మొత్తం 35 లీటర్ల కెపాసిటీ కలిగిన 95 క్యాన్లు సీజ్ చేసిన అధికారులు.. హోలోగ్రామ్ స్టిక్కర్లు, వందల కొద్దీ ఖాళీ బాటిల్స్ సీజ్ చేశారు. కేరళ మార్ట్, ఓఎస్డీ బ్రాండ్లకు చెందిన స్టిక్కర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గోడౌన్‌లో స్పిరిట్, కారిమిల్?ను మిక్స్ చేసి నకిలీ మద్యం తయారు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నేతలపై సీఎం చంద్రబాబు ఇప్పటికే వేటు వేసిన విషయం తెలిసిందే.

## సంతపేట మార్కెట్‌ను సందర్శించిన మంత్రి నారాయణ

**నెల్లూరు, అక్టోబర్ 6( వెలుతురు):**
నెల్లూరులోని సంతపేట మార్కెట్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. వ్యాపారులను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. అగ్నిప్రమాదం గురించి తనకు తెలియగానే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశానన్నారు. ప్రమాదానికి గురైన దుకాణాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. బాధితులకు పరిహారం కూడా త్వరలోనే అందజేస్తామని వెల్లడించారు. మార్కెట్‌లో వ్యాపారులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## కురుపాం గిరిజన పాఠశాలను పరిశీలించిన మంత్రి

**- బాలికల అస్వస్థతపై నివేదిక ఇవ్వాలని అచ్చన్న ఆదేశం**



**కురుపాం, అక్టోబర్ 6( వెలుతురు):**
పార్వతీపురం మన్యం జిల్లాలో ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. కురుపాం గిరిజన పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలను తెలుసుకున్నారు. ఈ ఘటనపై వైద్య, గిరిజన, సంక్షేమ శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేపట్టారు. బాలికల అస్వస్థతకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ ఘటనను సీఎం పర్యవేక్షిస్తున్నారని.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విశాఖపట్నం కేజీహెచ్, పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

## పైడితల్లి ఉత్సవాలను రాజకీయాలకు అతీతతంగా జరపాలి

**విజయనగరం అక్టోబర్ 6( వెలుతురు):**
పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాన్ని రాజకీయాలకు అతీతంగా జరపాలని జెడ్పీ చైర్మన్,విజయనగరం జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సంప్రదాయం గా వస్తున్న ఆచారాలను, పెద్దలను గౌరవించే విధానాలను ప్రభుత్వం పాటించాలని సూచించారు. టీడీపీ ప్రజాప్రతినిధులు రాజకీయ ప్రకటనలు చేసి దురుద్దేశాలను ఆపాదించవద్దు అని ఆయన హితవు పలికారు. శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరిన విధంగా ఆయనకు అమ్మ వారి సిరిమాను దర్శనానికి ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు చేయాలని మజ్జి శ్రీనివాసరావు కోరారు

# కాంగ్రెస్ ఇమేజ్ డ్యామేజ్...

## తలనొప్పిగా మారిన రేవంత్ కామెంట్స్

హైదరాబాద్, అక్టోబరు 6,( వెలుతురు)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన బీహారీ వ్యాఖ్యలు పెను దుమారం సృష్టిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీహార్ రాజకీయ నేతలు, ముఖ్యంగా బీజేపీ, ఇతర ప్రాంతీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డికి సొంత పార్టీ కాంగ్రెస్ నుంచే విమర్శల సెగ తగలడం గమనార్హం. కాంగ్రెస్ యువ నేత కన్హయ్య కుమార్ రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయన్ను మూరు?డు అని అభివర్ణించడం ఈ వివాదాన్ని మరింత రాజుకునేలా చేసింది.తెలంగాణలో స్థానిక ఉద్యోగాల గురించి ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి, బీహారీలను ప్రస్తావించారు. "మీరు ఇక్కడ ఈ ఉద్యోగాలు చేస్తే, బీహార్ నుండి వచ్చే వారు ఇక్కడికి రారు" అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను బీహారీలను అవమానించేవిగా ఉన్నాయని, వలస కార్మికులను కించపరిచేలా రేవంత్ రెడ్డి మాట్లాడారని బీహార్ నేతలు, ప్రజలు భావించారు. మొదట రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్ ఈ వ్యాఖ్యలను ఖండించారు. రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని పీకే ఘాటుగా విమర్శించారు. బీహార్ ప్రజలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శ్రమను అవమానించడం తగదని అన్నారు.పీకే విమర్శల తర్వాత ఈ అంశంపై మౌనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించింది. ఆ పార్టీ యువ నేత, ఫైర్ బ్రాండ్ గా పేరొందిన కన్హయ్య కుమార్, రేవంత్ రెడ్డి కామెంట్స్ ను తప్పుబట్టారు. ఏ మాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని మూరు?డు అని సంబోధించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలివి లేదని, ఎవరేంటో తెలియకుండా మాట్లాడతారా అని ప్రశ్నించారు. సొంత పార్టీ నేత అయినా సరే, మూరు?డిని మూరు?డనే





అంటానని కన్హయ్య కుమార్ కుండబద్దలు కొట్టారు. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా తెలివి తక్కువని అని ఆయన స్పష్టం చేశారు. బీహార్ ప్రజల కష్టాన్ని, శక్తిని అవమానించే అధికారం ఎవరికీ లేదని, తాను బీహారీగా ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. సొంత పార్టీ ముఖ్యమంత్రిపై ఇంతటి తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.కన్హయ్య కుమార్ విమర్శల వెనుక బలమైన రాజకీయ కోణం దాగి ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యాఖ్యలన్నీ యాదృచ్ఛికంగా జరగలేదని, త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ అధిష్టానం రూపొందించిన గేమ్ ప్లాన్ ఇందులో దాగి ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బీహార్లోని కోట్ల మంది ప్రజల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతను తీసుకొచ్చాయి. ఇవి ఇండియా కూటమికి నష్టం కలిగించేలా ఉన్నాయి. ఇప్పుడు సొంత పార్టీ నేతలే ఆ వ్యాఖ్యలను బహిరంగంగా ఖండించడం ద్వారా, కాంగ్రెస్ పార్టీ బీహారీలకు అండగా ఉందనే సందేశం ఇస్తోంది. బీహార్ రాజకీయాల్లో, ముఖ్యంగా యువతలో కన్హయ్య కుమార్ కు మంచి పట్టు ఉంది. రేవంత్ మాటలను ఖండించడం ద్వారా బీహారీల ఆత్మగౌరవాన్ని కాపాడే నేతగా కన్హయ్య కుమార్ నిలుస్తారు. ఇది పార్టీకి మేలు చేస్తుంది.మొత్తం మీద, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారాయి. సొంత రాష్ట్రంలో స్థానికుల మనోభావాలను సంతృప్తిపరచడానికి చేసిన ప్రయత్నం, దేశంలోని అతి ముఖ్యమైన రాష్ట్రాల్లో ఒకటైన బీహార్లో పార్టీకి నష్టం కలిగించే పరిస్థితిని సృష్టించింది. ఈ నేపథ్యంలో, కన్హయ్య కుమార్ లాంటి నేత బహిరంగంగా విమర్శించడం రేవంత్ రెడ్డిపై మరింత ఒత్తిడి పెంచనుంది. మరి ఈ వివాదంపై రేవంత్ రెడ్డి క్షమాపణ చెబుతారా, లేక ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# చలాన్లు పెండింగ్ ఉంటే వెహికిల్ సీజ్

న్యూఢిల్లీ, అక్టోబరు 6,( వెలుతురు)

రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా.. ఎన్ని కఠిన నిబంధనలు విధించినా ప్రమాదాలు తగ్గడం లేదు. వివిధ కారణాలతో వాహనదారులు రూల్స్ అతిక్రమిస్తున్నారు. జరిమానా విధించినా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జరిమానా వసూలుతోపాటు వాహనదారుల్లో మార్పు కోసం మరికొన్ని కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. మోటారు వెహికిల్స్ రూల్స్ – 1989లో కేంద్రం ప్రతిపాదించిన సవరణలు రవాణా నియంత్రణలో కొత్త పద్ధతులను తీసుకురావడం లక్ష్యంగా ఉన్నాయి. ఇప్పటి వరకు చలాన్ చెల్లించడానికి ఇచ్చిన 90 రోజుల గడువును 45 రోజులకు తగ్గించాలని నిర్ణయించారు. నిర్ణీత గడువులో చెల్లించని వాహనాలు సీజ్ చేసే అధికారం అధికారులకు లభించనుంది.కొత్త నిబంధనల ప్రకారం ఐదుకుపైగా ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదైతే డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. తరచూ నిబంధనలు అతిక్రమించే డ్రైవర్లను నియంత్రించడానికి ఇది సమర్థమైన చర్యగా భావిస్తున్నారు.చలాన్ చెల్లింపులో ఆలస్యం జరిగితే, ఆ వాహనంపై ఏ రకమైన రిజిస్ట్రేషన్, బీమా లేదా విక్రయ లావాదేవీలు చేయడం సాధ్యంకాదని తాజా ముసాయిదా నిబంధనలు చెబుతున్నాయి. ఇది చట్టం సక్రమంగా అమలుకు దోహదం చేస్తుంది.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను ఇప్పటి కంటే వేగంగా పరిష్కరించేందుకు, ఘటన చోటు చేసుకున్న మూడు రోజుల్లోపు నోటీసు జారీ చేయడం తప్పనిసరి కానుంది. ఈ చర్యతో వ్యవస్థ పారదర్శకంగా, సమయపాలనతో నడవడం సులభమవుతుంది.ప్రతిపాదనలు తుది రూపం దాల్చే ముందు, వీటిపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించాలని కేంద్రం నిర్ణయించింది. సూచనలు లేదా అభ్యంతరాలు ఉన్నవారు రవాణాశాఖ అదనపు కార్యదర్శికి పంపించవచ్చని తెలిపింది.రోడ్డుపై క్రమశిక్షణ పెంచడం, ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గించడం కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యం. వాహనదారుల్లో చట్టపరమైన అవగాహన, బాధ్యత పెంచడం ద్వారా ప్రమాదాల శాతం తగ్గించాలనే ప్రభుత్వ ఆశయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ కఠినతరం కావడంతోపాటు, నగరాల్లో క్రమశిక్షణ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

# బీహార్ లో కింగ్ మేకర్ గా పీకే...

పాట్నా, అక్టోబరు 6,( వెలుతురు)



ప్రశాంత్ కిషోర్. పేరుపొందిన రాజకీయ వ్యూహకర్త. మనదేశంలో రాజకీయాలను కూడా కార్పొరేట్ మయం చేసిన వ్యక్తి. పైగా ఎలాంటి రాజకీయాలు చేయాలో.. ఎలాంటి రాజకీయాలు చేస్తే ఓట్లు పడతాయో.. ఒక స్ట్రాటజీ మాదిరిగా అతను చెప్పేవాడు. మనదేశంలో ఉన్న మెజారిటీ రాజకీయ పార్టీలకు అతడు పని చేశాడు. అయితే ఎక్కువసార్లు అతడి ప్రణాళికలు విజయవంతమై.. అతడు పని చేసిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఏపీలో వైసిపి, టిడిపి, కేంద్రంలో బిజెపి, ఒకానొక సందర్భంలో భారత రాష్ట్ర సమితి, టిఎంసి.. ఇలా అనేక రాజకీయ పార్టీలు అతడి ప్రణాళికలను అమలు చేసి అధికారంలోకి వచ్చాయి. ఎవరికో సేవలు చేసి.. అధికారంలోకి తీసుకొచ్చే బదులు.. తనే ఒక రాజకీయ పార్టీని పెట్టాలని ప్రశాంత్ కిషోర్ అనుకున్నాడు. అనుకున్నది తడవుగా జన్ సూరజ్ పేరుతో పార్టీ ని ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం ఆ పార్టీ బీహార్ రాష్ట్రంలో పోటీ చేస్తోంది.ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో ప్రశాంత్ కిషోర్ పార్టీ బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోందని తెలిపింది.. అందువల్లే ప్రశాంత్ కిషోర్ వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీని.. ప్రతిపక్ష పార్టీని తనదైన వ్యూహాలతో ఇబ్బంది పెడుతున్నారు. గతంలో ఈ పార్టీలతో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్ తనదైన చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఏమాత్రం అవకాశం దొరికినా చాలు రెచ్చిపోతున్నారు. తను ఇప్పటికిప్పుడు అధికారంలోకి రాకపోయినా పర్వాలేదు గానీ.. బీహార్ రాష్ట్ర అభివృద్ధిని మాత్రం విస్మరించేది లేదని ప్రశాంత్ కిషోర్ చెప్తున్నారు..రాజకీయ వ్యూహ కర్తగా పేరుపొందిన ప్రశాంత్ కిషోర్ పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తాను ఎదుర్కొన్న రాజకీయపరమైన విషయాలను మొహమాటం లేకుండా చెబుతున్నారు. 2021 నుంచి ఇప్పటివరకు కన్సల్టెన్సీ సేవల ద్వారా తాను 241 కోట్లు సంపాదించాలని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. వీటిలో 30.95 కోట్లు జీఎస్టీ రూపంలో.. 20 కోట్లు ఐటి రూపంలో చెల్లించినట్టు పేర్కొన్నారు. 98.75 కోట్లను పార్టీకి డొనేషన్ రూపంలో ఇచ్చినట్టు వెల్లడించారు. తన నైపుణ్యాన్ని అనుభవాన్ని ఉపయోగించి రెండు గంటలకు 11 కోట్లు తీసుకున్నట్టు ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు.. " రాజకీయాలు , వ్యాపారం వేరువేరు కాదు. ఒక వ్యాపారి ముందస్తు లాభాలను గురించి పెట్టుబడి పెడుతుంటాడు. జనాల అవసరాలకు తగ్గట్టుగా నడుచుకుంటాడు. రాజకీయ పార్టీలు కూడా అంతే. జనాల అవసరాల ఆధారంగా హామీలు ఇస్తుంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయడంలో షరతులు విధిస్తుంటాయి. ఎన్నికల్లో చేసిన ఖర్చుకు మించి సంపాదిస్తుంటాయి. అయితే ఇందులో వ్యూహాత్మకతను పాటించే రాజకీయ పార్టీకి మాత్రమే అధికారం దక్కుతుందని" ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

# ఫ్లైఓవర్ పై యూ టర్న్...

హైదరాబాద్, అక్టోబరు 6,( వెలుతురు)




'తెలుగు తల్లి ఫ్లైఓవర్' పేరును 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 30 రాత్రి సచివాలయం సమీపంలోని ఈ ఫ్లైఓవర్ వద్ద కొత్త బోర్డును ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అయితే మంగళవారం సాయంత్రానికే ఆ బోర్డును బ్లూ కలర్ గుడ్డతో, తెల్లటి పేపర్‌తో కప్పేసింది. ఈ విషయం తెలంగాణలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వం వివాదాలకు భయపడి వెనక్కి తగ్గిందా? లేక అధికారికంగా ప్రారంభించడానికి అలా చేశారా అన్నది తెలియాల్సి ఉంది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, సచివాలయం, హైటెక్ సిటీలను కలిపే కీలక మార్గంగా 'తెలుగు తల్లి ఫ్లైఓవర్' ప్రసిద్ధి. చంద్రబాబు హయాంలో నిర్మితమైన ఈ ఫ్లైఓవర్, తెలుగు సాహిత్యం, సంస్కృతి ప్రతీకగా సమీపంలో తెలుగుతల్లి విగ్రహం ఉండటంతో 'తెలుగు తల్లి' పేరుతో గుర్తింపు పొందింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ పేరు కొనసాగింది. కొత్త సెక్రటేరియట్ నిర్మించిన తర్వాత తెలుగుతల్లి విగ్రహాన్ని కేసీఆర్ హయాంలో అక్కడి నుంచితొలగించారు. మళ్లీ ఏర్పాటు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తెలంగాణ గుర్తింపును బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పేరు మార్పు ప్రతిపాదనలు వచ్చాయి. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ బోర్డు ఈ నిర్ణయానికి అంగీకారం తెలిపింది. సోమవారం రాత్రి ఫ్లైఓవర్ ప్రారంభం వద్ద 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్' అని రాసిన కొత్త సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఏం జరిగిందో కానీ మంగళవారం సాయంత్రానికే ఆ బోర్డు కనిపించకుండా పోయింది. స్థానికులు, సోషల్ మీడియా యూజర్లు షేర్ చేసిన ఫోటోల ప్రకారం, బోర్డును బ్లూ కలర్ గుడ్డతో కప్పేసి, మీద తెల్లటి పేపర్ అతికించారు. కేటీఆర్ పార్టీ సోషల్ మీడియా ద్వారా రేవంత్ ప్రభుత్వాన్ని 'తెలంగాణ గుర్తింపును అవమానిస్తున్నారు' అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా అధికారిక స్పందన ఇవ్వలేదు. కానీ కొంత మందిగ్రేటర్ అధికారులు మార్పులు చేస్తున్నామని సైన్ బోర్డు రెడీ అవగానే పెడతామన్నారు.

# రేసులో వెనుకబడ్డ కాంగీ

హైదరాబాద్, అక్టోబరు 6,( వెలుతురు)




తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఖాళీ అయిన ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటే దీనికి కూడా ఉప ఎన్నిక జరగనుందన్న సంకేతాలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ ఉప ఎన్నిక అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారడంతో, గెలుపు కోసం రెండు పార్టీలు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమవుతున్నాయి.గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ స్థానాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్, ఈ ఉప ఎన్నికలోనూ తమ జెండా ఎగురవేయాలని పట్టుదలగా ఉంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ప్రత్యర్థుల కన్నా ఒక అడుగు ముందుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడం ద్వారా, రాష్ట్రంలో తమకు ప్రజాబలం తగ్గలేదని నిరూపించుకోవాలని భావిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, పాలన విఫలమైందని బీఆర్ఎస్ నేతలు బలంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఉప ఎన్నికలో గెలుపు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు, భవిష్యత్ రాజకీయాలకు ఒక సంకేతంగా పనిచేస్తుందని ఆ పార్టీ నాయకత్వం విశ్వసిస్తోంది. క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఈ ఉప ఎన్నిక ఒక అగ్నిపరీక్షగా మారింది. బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలంటే జూబ్లీహిల్స్‌లో గెలుపు తప్పనిసరి అని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలు వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని చూస్తోంది. ఈ ఎన్నికలో గెలిస్తే, ప్రభుత్వ పనితీరుకు ప్రజల ఆమోదం లభించినట్లవుతుందని, ప్రతిపక్షాల నోరు మూయించవచ్చని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఈ స్థానాన్ని బీఆర్ఎస్ నుంచి కైవసం చేసుకోవడం ద్వారా, రాజధాని నగరంలో పట్టు సాధించాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.గెలుపు అత్యంత కీలకంగా మారిన ఈ తరుణంలో, కాంగ్రెస్ పార్టీ ఇంకా తమ అభ్యర్థిని ఖరారు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటమే ఈ జాప్యానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, గతంలో పోటీ చేసిన వారు, కొత్తగా పార్టీలో చేరిన బలమైన నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, తమకు సామాజికవర్గాల బలం ఉందని అధిష్టానం వద్ద తమ వాదనలు వినిపిస్తున్నారు. ఎక్కువ మంది ఆశావహులు ఉండటం పార్టీకి బలమే అయినా, అభ్యర్థి ఎంపికలో జాప్యం చేయడం వల్ల ప్రచారంలో వెనుకబడతామనే ఆందోళన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అభ్యర్థి ఎంపిక బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులకు అప్పగించారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేశారుఅభ్యర్థి ఎంపికలో ఆలస్యం జరిగే కొద్దీ పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టికెట్ దక్కని నేతలు అసంతృప్తికి గురై, పార్టీ అధికారిక అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం ఉంటుంది. వారిని బుజ్జగించి, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడం అధిష్టానానికి సవాలుగా మారనుంది. ఈ లోపు ప్రత్యర్థి పార్టీ ప్రచారంలో మరింత ముందుకు దూసుకుపోతుంది. వీలైనంత త్వరగా సర్వేలు, అంతర్గత సమీక్షల ఆధారంగా గెలుపు గుర్రాన్ని ఎంపిక చేసి, పూర్తిస్థాయిలో ప్రచార బరిలోకి దిగాలని, లేకపోతే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మారుతుందని కాంగ్రెస్ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

### కమలంలో కనిపించని జోష్

జూబ్లిహిల్స్ ఉపఎన్నిక విషయంలో భారతీయ జనతా పార్టీ అంటీ ముట్టనట్లుగా ఉంది. అభ్యర్థి గురించి ఎలాంటి కసరత్తు చేయలేదు. నేడో రేపో నోటిఫికేషన్ వస్తుందని అనుకుంటున్న సమయంలో హఠాత్తుగా అభ్యర్థి ఎంపిక కోసం ముగ్గురు సభ్యులతో ఓ కమిటీ వేశారు. ఆ కమిటీలో ఉన్న ముగ్గురు ఎవరో చాలా మందికి తెలియదు. ఎవరికీ తెలియని నేతలు పార్టీ అభ్యర్థిని సిఫారసు చేయడం ఏమిటో తెలియక చాలా మంది బీజేపీ నేతలే ఆశ్చర్యపోతున్నారు.గత ఎన్నికల్లో లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. ఈ సారి కూడా పోటీ చేయడానికి ఆసక్తితో ఉన్నారు. అదే సమయంలో తాము పోటీ చేస్తామని ఆ పార్టీలో పోటీపడుతున్న వారు కూడా లేరు. సాధారణంగా ఇలాంటి ఉపఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది ముందుకు రావాలి. కానీ ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేసి ప్రచారం చేసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేసినా ప్రకటించుకోలేని పరిస్థితుల్లో ఉంది. హైకమాండ్ ప్రకటించేలా ప్రాసెస్ ప్రారంభించింది.బీజేపీకి జూబ్లిహిల్స్‌లో కొంత బలం ఉంది. విజయానికి ఎప్పుడూ దగ్గరగా రాలేదు కానీ.. స్థిరమైన ఓటు బ్యాంక్ మాత్రం ఎప్పుడూ ఫలితాల్లో కనిపిస్తూనే ఉంటుంది. ఈ సారి కూడా గెలిచే అవకాశం లేదన్న కారణంగా .. పెద్దగా ఆసక్తి చూపించడం లేదని అంటున్నారు. కానీ మూడు పార్టీల మధ్య హోరాహోరీలో ఏమైనా జరగవచ్చని బలమైన అభ్యర్థిని నిలబెడితే.. పోటీలో ఉండవచ్చని బీజేపీ క్యాడర్ అనుకుంటున్నారు.

# పీకల్లోతు కష్టాల్లో అగ్రరాజ్యం

## వేలాది మందికి జీతాల్లేవు

న్యూయార్క్, అక్టోబరు 6,( వెలుతురు)

అమెరికా అంటే అవకాశాల స్వర్గం.. డాలర్ రాజ్యం.. సంపన్న దేశం.. ఇలాంటి ఉప మానాలనే మీడియా ఉపయోగిస్తుంది. అమెరికా గురించి సినిమాలలో కూడా గొప్పగా చెబుతుంటారు. ఇక ప్రపంచ దేశాలు కూడా అమెరికా అంటే భయపడుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా మారకం అనేది డాలర్ తో కొనసాగిస్తారు కాబట్టి.. సహజంగానే డాలర్ కు విపరీతమైన గిరాకీ ఉంటుంది. అయితే అంతటి అమెరికా ఇప్పుడు ముప్పు ముంగిట ఉందా? త్వరలో ఆర్థికంగా పతనం కాబోతోందా? ఇప్పుడు ఈ ప్రశ్నలే మీడియాలో వినిపిస్తున్నాయి.ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తూ అమెరికా బెంబేలెత్తిస్తోంది. అంతేకాదు మరిన్ని టారిఫ్ లు విధిస్తామని ప్రపంచ దేశాలను హెచ్చరిస్తోంది. భారత్ నుంచి మొదలు పెడితే చైనా వరకు అన్ని దేశాలు కూడా అమెరికా టారిఫ్ ల వల్ల ఇబ్బంది పడుతున్నవే. అమెరికా వల్ల ప్రపంచ దేశాలు నరకం చూస్తున్నాయి. టారిఫ్ ల వల్ల ఆర్థికంగా నష్టపోతున్నాయి. ఇంత జరుగుతున్నప్పటికీ అమెరికా ఏమాత్రం తగ్గడం లేదు. వెనకడుగు వేసే అవకాశం కనిపించడం లేదు. పైగా ట్రంప్ వల్ల భారత ఐటీ పరిశ్రమ తీవ్రంగా



ప్రభావితమవుతోంది. ఇటీవల కాలంలోనే హెచ్ వన్ బి వీసాల విషయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచ ఐటి పరిశ్రమలను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. అయితే దీనిపై ట్రంప్ ఇంతవరకు వెనకడుగు వేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వార్తలు వినిపిస్తున్నాయి.ప్రపంచ దేశాలకు చుక్కలు చూపిస్తున్న అమెరికాలో అంతర్గతంగా మాత్రం పరిణామాలు ఏ మాత్రం బాగోలేదు.. అమెరికాలో బడ్జెట్ కు ఆమోదం లభించలేదు. దీంతో పూర్తిగా షట్ డౌన్ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. డెమొక్రటిక్, రిపబ్లికన్ లు వేరువేరుగా ప్రతిపాదనలు చేయడంతో అక్కడ పరిస్థితి దారుణంగా మారింది. వ్యయ ప్రామాణిక బిల్లు ఆమోదం పొందకపోవడంతో ఫెడరల్ ప్రభుత్వానికి నిధుల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అనేక విభాగాలు, కార్యాలయాలు తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశాయి. ఏకంగా ఎఫ్ఏ విభాగంలో 11 వేల మంది ఉద్యోగుల వేతనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అక్కడ అత్యవసర విమాన నియంత్రణ కార్యకలాపాలు మాత్రమే సాగుతున్నాయని తెలుస్తోంది. దాదాపు 41 శాతం మంది ఉద్యోగులకు వేతనాలు పూర్తిగా నిలిచిపోయాయి.అమెరికాలో ఏర్పడిన ఈ పరిస్థితి వల్ల హెల్త్, హ్యూమన్ సర్వీసెస్ ఏజెన్సీలు పనికి దూరమయ్యాయి. ప్రజారోగ్యం, విమాన రవాణా.. ఇతర అత్యవసర సేవలు మాత్రమే అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. రక్షణ, పోలీసు, ఎమర్జెన్సీ హెల్త్ సర్వీస్ వంటి విభాగాలు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. గడచిన ఏడు సంవత్సరాల కాలంలో అమెరికా ఇలా స్తంభించిపోవడం ఇది మొదటిసారి కావడం విశేషం. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వల్లే ఇదంతా జరుగుతోందని అమెరికా మీడియాలో వార్తలు వస్తున్నాయి. బడ్జెట్ ఆమోదం విషయంలో ఏర్పడిన ఈ సందిగ్ధత అమెరికా పరువును మొత్తం పోగొట్టిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇటువంటి పరిణామాలు అగ్రరాజ్యానికి ఏమాత్రం మంచివి కావని వాపోతున్నారు.

వెలుతురు

cinema

# నాగశౌర్య కొత్త సినిమా బ్యాడ్ బాయ్ కార్తీక్

## టీజర్ విడుదల చేసిన మేకర్స్

నాగశౌర్య ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. విధి కథానాయిక. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్ కథతో దీనిని తెరకెక్కించినట్లు టీజర్ ఆధారంగా అర్థమవుతోంది. నటి పూర్ణ సీరియస్ లుక్‌లో కనిపించగా.. సాయి కుమార్ పోలీస్ పాత్రలో తనశైలిలో డైలాగ్ చెప్పారు. ఛలో సినిమాతో సూపర్ హిట్ అందుకుని బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ వచ్చిన నాగశౌర్య కొంత కాలంగా సైలెంట్ అయ్యాడు. చివరిగా 2023 లో రంగబలి అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఆ సినిమా కూడా యావరేజ్ టాక్ తెచ్చుకుంది. దాంతో సినిమాలకు లాంగ్ గ్యాప్ ఇచ్చేసాడు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులని అలరించటానికి వస్తున్నాడు. నూతన దర్శకుడు రామ్ దేశిన దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఎప్పుడో ప్రకటించాడు శౌర్య. ఎప్పటినుండో సెట్స్ పై ఉన్న ఈ సినిమా టీజర్ ను ఈ రోజు రిలీజ్ చేసారు మేకర్స్. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటె÷-టంల్గ÷నర్ గా బ్యాడ్ బాయ్ కార్తీక్ టీజర్ ను రిలీజ్ చేసారు. భార్గ్ ÷ట్స్, రొటీన్ డైలాగ్స్ తో నింపేసారు. ఇక చివర్లో వెన్నెల కిషోర్ తో ఏదో కామెడీ అని ట్రై చేసారు. ఓవరాల్ గా చూస్తే బ్యాడ్ బాయ్ కార్తీక్ ఒక రొటీన్ కమర్షియల్ టీజర్ లానే అనిపిస్తోంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మరియు శ్రీదేవి విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా తమిల్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ హారిస్ జయరాజ్ సంగీతం అందిస్తున్నారు. నాగ శౌర్య కు జోడిగా వీధి హీరోయిన్ గా నటిస్తుండగా వైష్ణవి ఫిలింస్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు.






# మహానటిలో ఏఎన్నార్ పాత్ర నా అదృష్టం

## నటుడు నాగచైతన్య వెల్లడి

'మహానటి' సినిమాలో పాత్రను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు నటుడు నాగచైతన్య తెలిపారు. జీ5లో ప్రసారమయ్యే 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే, ప్రతి ఒక్కరి జీవితంలో ఒడుదొడుకులు ఉంటాయని, వాటి నుంచి పాఠం నేర్చుకొని పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు వెళ్తే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. మహానటి' సినిమా గురించి ఆయన గుర్తుచేసుకుంటూ.. 'నాగ్ అశ్విన్ నాకు 'మహానటి'లో తాతయ్య పాత్ర (ఏఎన్ఆర్) చేయాలని చెప్పగానే తప్పించుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. ఎందుకంటే ఆయన లాగా నటించడం మరొకరికి సాధ్యం కాదు. 'నేను ఏఎన్నార్‌లా చేయడం ఏంటి?. నా వల్ల కాదు. అది అసాధ్యం. మర్చిపోండి' అని నాగ్ అశ్విన్‌తో చెప్పాను. పైగా ఆ సమయంలో 'సవ్యసాచి' షూటింగ్ చేస్తున్నా. గడ్డంతో డిఫరెంట్ లుక్‌లో ఉన్నా. ఆ సినిమాలో ఏఎన్నార్ పాత్రకు ఈ లుక్ సరిపోదని కారణం చెప్పి తప్పించుకోవాలనుకున్నా. గడ్డం తీయలేనని పంపించేశా. మళ్లీ నెలన్నర తర్వాత నాగ్ అశ్విన్ నా దగ్గరకు వచ్చాడు. 'వీఎఫ్ఎక్స్‌లో గడ్డం తీసేస్తాను. ఈ క్యారెక్టర్‌లో నువ్వు మాత్రమే నటించాలి' అని పట్టుబట్టాడు. దీంతో ఓకే చెప్పానన్నారు. తర్వాత ఆలోచిస్తే ఒక విషయం అర్థమైంది. ఒకవేళ నేను చేయకపోతే వేరే నటుడు ఆ పాత్రలో చేస్తాడు. తాతయ్యగా వేరే వాళ్లు చేయడమంటే నా మనసు అంగీకరించదు. నాకు ఆఫర్ వచ్చాక.. నేనుండగా ఆ పాత్ర మరొకరు చేయడం ఏంటి? అనిపించింది. ఎవరేమనుకున్నా చేయాలి అని నిర్ణయించుకున్నా. ఆయనలాగా నేను నటించడం నాకు దక్కిన అదృష్టమని భావించాను. ఆయనపై నా ప్రేమను చూపించడానికి నాకు దక్కిన అవకాశమని అంగీకరించానని నాగచైతన్య చెప్పారు.

# గృహిణి అని గర్వగా చెప్పండి

## నామోషీ పడాల్సిన పనిలేదన్న అమితాబ్



బాలీవుడ్ షహెన్‌షా అమితాబ్ బచ్చన్ మాటలంటే ఎంత స్పెషల్‌గా ఉంటాయో అందరికీ తెలిసిందే. తాజాగా కేబీసీ షోలో బిగ్‌బీ చెప్పిన మాటలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఓ కంటెస్టెంట్‌ని ఉద్దేశించి ఆయన.. చాలామంది మహిళలు 'నేను గృహిణిని' అని చిన్నగా అంటారు. కానీ ఇది చిన్న విషయం కాదు. గర్వంగా చెప్పండి! ఇంటి పనులు చూసుకోవడం, కుటుంబాన్ని కాపాడుకోవడం అంటే పెద్ద బాధ్యత' అని చెప్పడం అక్కడ ఉన్నవారినే కాదు, టీవీ ముందు చూసిన వాళ్లను కూడా ఇన్‌స్పైర్ చేసింది.ఇంకా ఆయన ఒక ఇంట్రెస్టింగ్ పాయింట్ షేర్ చేశారు. 'కోవిడ్ సమయంలో పురుషులు ఇంటి పనులు చేయాల్సి రావడం తో, గృహిణుల కష్టాలెంత కఠినమో అర్థమైంది' అన్నారు. బిగ్‌బీ చెప్పిన ఈ మాటలు వేదికపైనే చప్పట్ల వర్షం కురిపించాయి. నిజంగానే కదా.. మనం సాధారణంగా తీసుకునే 'ఇంటి పనులు' వెనుక అంత కష్టం, డెడికేషన్ ఉంటుందని ఆయన ఒక్క మాటలో చెప్పేశారు. అదే కాకుండా, ఇటీవల జరిగిన మహిళల క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌పై సాధించిన అద్భుత విజయాన్ని కూడా బిగ్‌బీ ప్రత్యేకంగా ప్రశంసించారు. 'భారతదేశానికి వీళ్లు అతిపెద్ద సంపద' అంటూ ట్వీట్ చేశారు. ఇలా ఎప్పటికప్పుడు పాజిటివ్‌గా మాట్లాడే అమితాబ్ బచ్చన్ కామెంట్స్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.

# చాలాకాలం తరవాత మళ్లీ తెర మీదకు సమంత

## మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు

స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్‌కి రాబోతున్నారు. హెల్త్ ప్రాబ్లం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ ఇచ్చిన సమంత తర్వాత ప్రోడ్యూసర్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరిట 'శుభం' మూవీతో నిర్మాతగా తన అడుగులు పెట్టి మొదటి చిత్రం తోనే హిట్ అందుకుంది. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు రాబోతుంది. గతేడాది ఈ మూవీ నుండి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సమంత గన్, మెడలో తాళి బొట్టు, రక్తంతో నిండిన ముఖంతో ఫుల్ డ్రామా లుక్‌లో కనిపించారు. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఆ అప్‌డేట్ కోసం సోషల్ మీడియా ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఈ నెలలోనే 'మా ఇంటి బంగారం' షూటింగ్ ప్రారంభం అవుతుంది అంటూ సమంత స్వయంగా తెలిపారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. చాలా రోజుల తర్వాత సమంతను మళ్లీ స్క్రీన్‌లో చూడబోతున్నాం అంటూ మురిసి పోతున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ వార్త ట్రెండ్ అవుతోంది.




# క్రికెటర్ సచిన్‌తో ప్రయాణం

## జీవితంలో మరవలేని అనుభూతి: తమన్

ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ మరోసారి వార్తల్లో నిలిచారు. సంగీతంతో ప్రేక్షకుల మనసు దోచుకుంటూనే, సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ అభిమానులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ఉంటారు. తాజాగా తమన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఇందులో ఆయన తనకు తారసపడిన అరుదైన క్షణాన్ని అభిమానులతో పంచుకున్నారు. డల్లాస్ నుండి దుబాయ్‌కు వెళ్తున్న సమయంలో తనతో కలిసి ప్రయాణించిన క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ గురించి ట్వీట్ చేస్తూ, ఆయనతో దిగిన ఫోటోను పోస్ట్ చేశారు. క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ గారితో డల్లాస్ నుంచి దుబాయ్ వరకు ప్రయాణించడం గొప్ప అనుభవం. ప్రయాణ సమయంలో మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. సీసీఎల్ మ్యాచ్‌లలో నా బ్యాటింగ్ వీడియోలు చూపించాను. చూసిన వెంటనే సచిన్ 'నీ బ్యాట్ స్పీడ్ అద్భుతంగా ఉంది' అని ప్రశంసించారు. ఇది నా జీవితంలోని గొప్ప క్షణం. త్వరలోనే ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావొచ్చు' అంటూ తమన్ పేర్కొన్నారు.తమన్ చివరిగా 'త్వరలో కలిసి పని చేయొచ్చు' అనే వ్యాఖ్య నెటిజన్లలో ఆసక్తిని రేపుతోంది. దీనిపై సోషల్ మీడియాలో వివిధ ఊహాగానాలు వెలువడుతున్నాయి. 'సచిన్ సినిమాల్లో నటించనున్నారా?, తమన్ సచిన్ బయోపిక్‌కి సంగీతం అందించనున్నారా?, లేదా ఇద్దరూ ఏదైనా క్రికెట్ ప్రాజెక్ట్ కోసం కలవబోతున్నారా? అని అభిమానులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. తమన్ కేవలం సంగీత దర్శకుడిగానే కాకుండా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ లో తెలుగు వారియర్స్ తరఫున క్రికెట్ ఆడుతూ తన బాటింగ్ టాలెంట్‌ను చూపించారు. చాలా మ్యాచుల్లో తన ఆటతో జట్టుకు విజయాన్ని అందించారు. ఇప్పుడు ఆయన బ్యాటింగ్ గురించి సచిన్ కూడా మాట్లాడటం తమన్‌కు మరింత గర్వకారణంగా మారింది. ఇటీవలే పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రానికి సంగీతం అందించి మ్యూజికల్ బ్లాక్‌బస్టర్‌గా మార్చిన తమన్, ప్రస్తుతం 'అఖండ 2: తాండవం', ప్రభాస్ 'ది రాజా సాబ్' వంటి భారీ ప్రాజెక్టులకి పనిచేస్తున్నారు. 'ఓజీ'లో తమన్ సంగీతం సినిమా విజయానికి కీలక కారణమైందని దర్శకుడు సుజీత్ ప్రత్యేకంగా అభినందించిన విషయం తెలిసిందే.








# ద ప్యారడైజ్ ఇంటర్నేషనల్ మూవీ

## బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ ప్రకటన

న్యాచురల్ స్టార్ నాని 'ది ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నాడు. దసరా హిట్ తర్వాత మళ్లీ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో జతకట్టిన నాని ఈసారి భారీ స్థాయి ప్రాజెక్ట్ చేయనున్నాడు. సుధాకర్ చెరుకూరి ప్రొడక్షన్‌లో నిర్మితమవుతున్న ఈ సినిమా 1980ల నాటి బ్యాక్‌డ్రాప్‌లో సాగనుందని సమాచారం. ఇందులో కాగా ఇప్పటికే విడుదలైన లుక్స్ లో.. నాని ఈ మూవీలో ఓ కొత్త తరహా మాస్ రోల్‌లో కన్పించనున్నాడు అని స్పష్టంగా అర్థమవుతుంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ విలన్‌గా నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ది ప్యారడైజ్ ఒక ఇంటర్నేషనల్ స్టాండర్డ్ మూవీ అవుతుంది. తెలుగు సినిమాను గ్లోబల్ లెవెల్‌కి తీసుకెళ్లే స్కోప్ ఈ ప్రాజెక్ట్‌కి ఉందని రాఘవ్ అన్నారు. అంతేకాదు, తన పాత్రకు న్యాయం చేయడానికి తెలుగు నేర్చుకుంటూ, సొంతంగా డబ్బింగ్ చెప్పేందుకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఆయన డెడికేషన్ చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌కి దసరా తర్వాత మరోసారి బ్లాక్‌బస్టర్ హిట్టు ఖాయమని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే 'ది ప్యారడైజ్'లో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారు అన్నది ఇంకా క్లారిటీ రాలేదు.

# కంచరపాలెంలో దొంగల బీభత్సం

**- బంగారం,నగదు దోచుకున్న దొంగలు**

**విశాఖపట్నం,అక్టోబర్6 ( వెలుతురు):**
విశాఖపట్నంలో భారీ చోరీ జరిగింది. నగరంలోని రెడ్డి కంచరపాలెంలో దొంగలు బీభత్సం సృష్టించారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఇంట్లోకి దుండగులు చొరబడి 12 తులాల బంగారం, రూ.3లక్షల నగదు, కారుతో పరారయ్యారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న వృద్ధురాలు, ఆమె మనవడి కాళ్లు, చేతులు కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దొంగలు తీసుకెళ్లిన కారును మారికవలస వద్ద గుర్తించారు. దుండగల ఆచూకీ కోసం చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# తిరుపతి ఎస్వీ వర్సిటీకి బాంబు బెదిరింపు

**- చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసుల అప్రమత్తం**

**- డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర గాలింపు...తనిఖీలు**

**తిరుపతి,అక్టోబర్ 6( వెలుతురు):**
తిరుపతి నగరంలో మరోసారి బాంబు బెదిరింపు వ్యవహారం కలకలం రేపింది. సిఎం చంద్రబాబు మంగళవారం తిరుపతి పర్యటన నేపథ్యంలో బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. తిరుపతి ఎస్వీ వ్యవసాయ వర్సిటీకి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. వర్సిటీ దగ్గర సీఎం చంద్రబాబు పర్యటన కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ దగ్గర ఐఈడీ బాంబులు పెట్టినట్టు ఈ-మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు హెలిప్యాడ్ పరిసరాల్లో బాంబు స్క్వాడ్, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే గతంలోనూ తిరుపతి నగరానికి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. నాలుగు చోట్ల ఆర్డీఎక్స్ పేలుడు పదార్థాలు పేలనున్నాయి.. అంటూ టీటీడీ డోనార్ సెల్‌కు మెయిల్స్ వచ్చాయి. మెయిల్‌తో బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లతో తిరుపతితోపాటు తిరుమలనూ అధికారులు జల్లెడ పట్టారు. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు దొరకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, అప్పుడు కూడా.. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఈ బాంబు బెదిరింపులు రావడం గమనార్హం. అసలు బెదిరింపులకు ఎవరు పాల్పడుతున్నారు ..ఎందుకు పాల్పడుతున్నారు..? ఈ బెదిరింపుల వెనక రాజకీయ లేదా వ్యక్తిగత కుట్రలు ఉన్నాయా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తాజా బెదిరింపుల నేపథ్యంలో తిరుపతిలో భద్రతను మరింత పెంచారు.

# నేను దేవుడునని చెప్పినా అమ్మ నమ్మలేదు

**- అందుకే అమ్మను దేవుడి వద్దకు పంపించా**

**- ప్రొద్దుటూరు హత్యపై పోలీసుల విచారణలో వెల్లడి**

**- పోస్ట్‌మార్టమ్ అనంతరం తల్లి అంత్యక్రియలు పూర్తి**



**కడప,అక్టోబర్ 6( వెలుతురు):**
మానసిక స్థితి సరిగా లేని కొడుకు చేతిలో కన్నతల్లిని దారుణ హత్య చేసిన ఘటన ప్రొద్దుటూరులో కలకలం రేపింది. ప్రొద్దుటూరు శ్రీరామ్‌నగర్ కు చెందిన లక్ష్మీదేవి, భాస్కర్ రెడ్డి దంపతులకు యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక్కడే కుమారుడు. ఒక్కడే కుమారుడు కావడంతో చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచుకున్న దంపతులు యశ్వంత్ కుమార్ ను బీటెక్ వరకు చదివించారు. బీటెక్ పూర్తి చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఇంతవరకు యశ్వంత్ కుమార్ కు ఉద్యోగం రాలేదు. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా నాలుగు సంవత్సరాలుగా హైదరాబాద్‌లోనే ఒక్కడే రూమ్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు యశ్వంత్ కుమార్. యశ్వంత్ కుమార్ నెల ఖర్చులకు తల్లిదండ్రులు డబ్బు పంపించేవారు. అయితే, ఇటీవల యశ్వంత్ కుమార్ మానసిక స్థితిలో మార్పు గమనించిన తల్లిదండ్రులు యశ్వంత్ కుమార్ ను పలుమార్లు ఇంటికి రమ్మని పిలిచినా రాలేదు. కేవలం డబ్బులు పంపించమని మాత్రమే యశ్వంత్ కుమార్ తల్లిదండ్రులకు ఫోన్ చేసేవాడని పోలీస్ విచారణలో చెప్పినట్లు సమాచారం.. తాజాగా ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ఇంటికి చేరుకున్న యశ్వంత్ వచ్చిన వెంటనే తాను అడిగిన డబ్బు ఎందుకు పంపించలేదని, తాను ఒక దేవుడునని తాను అడిగినప్పుడు డబ్బు పంపించాలంటూ తల్లితో గొడవపడినట్లు సమాచారం. ఇంట్లోనే పక్క గదిలో స్నానం చేస్తున్న తండ్రి భాస్కర్ ఎందుకు గొడవ పడుతున్నావు అంటూ పక్క గదిలో నుండి బయటకు వస్తున్న క్రమంలో తండ్రిని లోపలికి నెట్టి బయట గడియ పెట్టేశాడు.. ఆ తర్వాత తల్లి లక్ష్మీదేవిని కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని వంట రూమ్ నుంచి ఈడ్చుకుంటూ బయట వరండాలో పడేసి తన గదిలోకి వెళ్లి యశ్వంత్ తలుపులు వేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఇంటి వద్దకు వచ్చి తలుపులు పగలగొట్టి యశ్వంత్‌ను అదుపులోకి తీస్తున్నారు.అయితే, తాను ఒక దేవుడిని.. ఈ విషయం తన తల్లికి చెప్తే నమ్మడం లేదని, అందుకే దేవుడు వద్దకే పంపించాను అంటూ యశ్వంత్ కుమార్ పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. యశ్వంత్ మానసిక స్థితిపై పోలీసులు విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లో యశ్వంత్ పెరిగిన పరిస్థితులు.. గతంలో ఇతని మానసిక స్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. లక్ష్మీదేవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పజెప్పడంతో సోమవారం ఉదయం లక్ష్మీదేవి మృతదేహానికి బంధువులు అంత్యక్రియలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హంతకుడైన కొడుకును తలకొరువి పెట్టడానికి పంపించాలంటూ పోలీసులను తండ్రి భాస్కర్ కోరారు.

# పెట్రోల్ బంకు వద్ద కారులో మంటలు

**- అప్రమత్తం అయి మంటలు ఆర్పిన సిబ్బంది**

**హైదరాబాద్, అక్టోబర్6 ( వెలుతురు):**
హైదరాబాద్ పంజాగుట్టలో పెద్ద ప్రమాదం తప్పింది. పెట్రోల్ బంకులో కారులు సడెన్ గా మంటలు చెలరేగటంతో ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వెంటనే అలర్ట్ అయిన సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సోమవారం పెట్రోల్ కొట్టించడానికి వచ్చిన కార్ లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్పందించిన పెట్రోల్ పంపు సిబ్బంది.. అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పేశారు. దీంతో పెట్రోల్ బంకుకు ప్రమాదం తప్పటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. పెట్రోల్ బంక్ లో ఉన్న కార్ లో మంటలు రావడంతో సిబ్బంది, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. మంటలను చూసి వాహనదారులు దూరంగా పరిగెత్తారు. మంటలను ఆర్పిన వెంటనే కార్ ను పెట్రోల్ బంక్ నుండి బయటికి తీసుకెళ్లారు. పంజాగుట్ట లోని ఎర్రమంజిల్ లో ఉన్న పెట్రోల్ బంకులో ఈ ప్రమాదం జరిగింది.

# సుప్రీం తీర్పుతో కాంగ్రెస్ తొలి విజయం

**- 42శాతం రిజర్వేషన్లను ఎవరూ ఆపలేరు**

**- బిజెపి, బిఆర్ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదు**

**- జనగామ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి**

**జనగామ, అక్టోబర్6 ( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి స్వాగతించారు. ఇది స్థానిక ఎన్నికల్లో రేవంత్ సర్కార్ సాధించిన తొలి విజయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలు అయిన పిటీషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. సోమవారం విచారణలో భాగంగా పిటిషన్ ను కొట్టివేసింది న్యాయస్థానం. ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతుందని.. అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు నిర్ణయంపై స్పందించారు ఆయన స్పందించారు. కోటాపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రతాపరెడ్డి అన్నారు. 42శాతం బిసి కోటాపై ప్రభుత్వ కట్టుబడి ఉన్నదని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు తీసుకొచ్చి



జీవో కూడా ఇచ్చిందని అన్నారు. బీసీ కోటాపై అన్ని ఆలోచించే ప్రభుత్వం సజావుగా నిర్ణయం తీసుకుందని అన్నారు. అయితే కొందరు కావాలనే కోర్టులకు వెళు తున్నారని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజల భాగస్వామ్యంతోనే బీసీ కోటా సాధ్యమని సిఎం రేవంత్ ఎప్పుడో అన్నారని గుర్తు చేశారు. కోటాపై వ్యతిరేక పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. బీసీలకు 42 శాతం కోటా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని స్పష్టం చేశారు. సుప్రీం కోర్ట్ తీర్పు శుభ పరిణామని.. 42 శాతం బిసి రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టు లో వేసిన కేసును కోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసి లకు రిజర్వేషన్లు ఇచ్చే విశయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తుందని అన్నారు.ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లు బిసి రిజర్వేషన్లు అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని..బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు అన్ని వర్గాలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అతిపెద్ద విజయం సాధించబోతోందని అన్నారు. బిఆర్ఎస్, బిజెపిలను ప్రజలు నమ్మడం లేదన్నారు.

# కార్యరూపం దాల్చేలా పోలవరం పనుల నిర్వహణ

**- రూ. 900 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం**

**- వచ్చే మే నెల చివరి వరకు 28,946 మందికి లబ్ధి**

**- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో మంత్రి నిమ్మల చర్చలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్6 ( వెలుతురు):**
పడకేసిన పోలవరం పనులను కార్యరూపం దాల్చేలా పనిచేస్తున్నామని ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుఅన్నారు. 2026 మే నెల చివరి వరకు 28,946 మందికి రూ. 900 కోట్లతో పునరావాసం కల్పిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 2027 మార్చి వరకు పోలవరం నిర్వాసితులను పునరావాసం పూర్తి చేస్తామని తెలిపారు. తాజాగా ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌తో భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ డిజైన్స్ అనుమతులపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. పోలవరం పనులు జరుగుతున్న తీరు పట్ల కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కేంద్రం పోలవరం నిర్మాణానికి ఇచ్చే ప్రతి రూపాయిను సద్వినియోగం చేస్తున్నామని తెలిపారు. 2027 డిసెంబర్ నాటికి ప్రధాని చేతుల మీదుగా పోలవరాన్ని జాతికి అంకితం చేసేందుకు ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి కేంద్ర జలశక్తి మంత్రి



సీఆర్ పాటిల్ ను ఆహ్వానించినట్లు చెప్పారు. బీహార్ ఎన్నికల తర్వాత ఆయన వస్తానని చెప్పారన్నారు. 7.2లక్షల ఎకరాలకు కొత్తగా నీరు అందించే ప్రాజెక్టు పోలవరం అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 25.03 లక్షల ఎకరాలకు స్థిరీకరణ అందించే ప్రాజెక్టు పోలవరం అన్నారు. 960 మెగావాట్ల విద్యుత్ అందించే ప్రాజెక్టు పోలవరంను గత ప్రభుత్వం హయాంలో అనిశ్చితిలోకి నెట్టివేసింది. కూటమి ప్రభుత్వం లో పోలవరానికి అమితమైన ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఏపి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ వల్ల పనులు తిరిగి వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఏపి సీఎం నిర్దేశిరచిన 2027 లక్ష్యానికి అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. వర్షాకాలంలో కూడా డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. చిత్తశుద్ధి తో పనులు పూర్తి చేస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వం 2019లో కూడా కొనసాగినట్లయితే ఇప్పటికే పోలవరం పనులు పూర్తయ్యేయి. గత ప్రభుత్వ హయాంలో 17 నెలల పాటు పోలవరం పనులు జరగలేదు. డయాఫ్రం వాల్ దెబ్బ తినడానికి గత ప్రభుత్వ తప్పిదాలే కారణం. రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేశారు. కేంద్రం హెచ్చరికలను పట్టించుకోకుండా జగన్ సర్కార్ పోలవరం ప్రాజెక్టును రివర్స్ టెండరింగ్ పేరుతో అడ్డుకుంది. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే మా ప్రభుత్వం చేసిన పనులను ప్రజలు గుర్తించాలి. 900 కోట్ల వ్యయంతో డయాఫ్రం వాల్ నిర్మాణం కొత్తగా చేపట్టాల్సిరావడానికి కారణం జగన్ సర్కార్ నిర్వాకం! గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని మంత్రి వ్యాఖ్యానించారు.

# అర్థం కానీ కవిత వ్యూహం

**హైదరాబాద్, అక్టోబర్6 ( వెలుతురు):**
భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేయడంతో కవిత పూర్తి స్థాయి జాగృతి నేతగా మారిపోయారు. ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదించినా ఆమోదించకపోయినా ఆ పదవి లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు జాగృతిని బలోపేతం చేసుకునేందుకు కార్యవర్గాన్ని నియమించారు. జిల్లాల వారీగా క్యాడర్ ను రెడీ చేసుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఆమె జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించలేదు.జాగృతిలో పదవులన్నింటినీ మైనార్టీలు, గిరిజనులకే కేటాయిస్తున్నారు. ప్రధాన పదవుల్లో వారినే నియమిస్తున్నారు. ఇంత కాలం వారికి ఏ పార్టీలోనూ రాజకీయ ప్రాధాన్యత దక్కడంలేదని అంటున్నారు. అందుకే తాను ప్రాధాన్యం ఇస్తున్నానంటున్నారు. ఇక బీసీల ఎలాగూ ఉద్యమం చేస్తున్నారు. అదే విషయాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాను కూడా కాస్త బలంగానే నిర్వహిస్తున్నారు.ఇదంతా చేస్తున్న కవిత జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించడం మాత్రం మర్చిపోయారు. ముందుగా పార్టీ నిర్మాణాన్ని ప్రారంభించి ఆ తర్వాత పార్టీ ప్రకటన చేయాలని ప్లాన్ చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఆమె సొంత పార్టీ పెట్టుకోవడం, రాజకీయాల్లో కొనసాగడం ఖాయమని అందరికీ స్పష్టత ఉంది. అలాంటప్పుడు మంచి రోజు చూసుకుని పార్టీని ప్రకటించకుండా%ొ% కాలమే నిర్ణయిస్తుందని చెప్పడం.. పార్టీని నిర్మించుకోవడం ఎందుకన్న ప్రశ్న వస్తోంది. కానీ కవిత తన రాజకీయం తాను చేస్తున్నారు.త్వరలో




కల్వకుంట్ల కవిత రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేపట్టనున్నారు. ఈ పర్యటనల్లో మేధావులు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రజలతో పాటు ఈ రంగాల ప్రముఖుల సలహాలు, సూచనల ఆధారంగా మూడో విడత కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని కవిత తెలిపారు. కొత్త బాధ్యతలు అప్పగించిన వారు సంస్థ ఆశయాలకు అంకితమై పనిచేయాలని సూచించారు. ఈ నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని తెలిపారు.కవిత తన రాజకీయ వ్యూహంలో భాగంగా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నట్లు ప్రకటించారు. ఈ పర్యటనలో ఆమె కేవలం సంస్థాగత సమావేశాలకే పరిమితం కాకుండా, వివిధ జిల్లాల్లోని మేధావులు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. వారి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన సలహాల ఆధారంగానే కమిటీ మూడో దశ నియామకాలు ఉంటాయని ఆమె చెప్పారు. దీన్నిబట్టి కవిత, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తన రాజకీయ కార్యకలాపాలను రూపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమ కాలంలో ఆమె పోషించిన పాత్ర, తెలంగాణ జాగృతి ద్వారా సంపాదించుకున్న గుర్తింపును తిరిగి ప్రజల మధ్యకు తీసుకెళ్లి తన రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేయాలనుకుంటున్నారు.బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కావడం, ఇప్పుడు జాగృతి పునరుత్తేజం చేయడం.. ఇవన్నీ కవిత భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై తీవ్రమైన చర్చకు దారితీస్తున్నాయి. ఆమె కేవలం జాగృతి వేదికగా సామాజిక ఉద్యమకారిణిగా మాత్రమే కొనసాగుతారా? లేకుంటే ఈ వేదికను ఉపయోగించుకుని కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతానికి ఆమె ప్రకటనలు పూర్తిగా సామాజిక న్యాయం, తెలంగాణ అస్తిత్వం, ప్రజల సలహాల సేకరణ చుట్టూ తిరుగుతున్నాయి. అయితే, బీఆర్ఎస్ పార్టీ బలహీనపడుతున్న ఈ తరుణంలో, ఆమె ఎంచుకున్న ఈ మార్గం తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు.

# రాహూల్ ఆరు రోజులు... కొలంబియా టూర్...

**- ఏం చేస్తున్నారు... మిలియన్ డాలర్ల ప్రశ్న**

**న్యూఢిల్లీ, అక్టోబర్6 ( వెలుతురు):**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత.. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముని మనుమడు.. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ మనుమడు.. రాహుల్ గాంధీ. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత. చాలాకాలంగా రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనలు గోప్యంగా ఉంచుతున్నారు. భారత వ్యతిరేక శక్తులతో విదేశాల్లో సమావేశం అవుతున్నారు. తాజాగా రాహల్ ఆరు రోజులుగా విదేశంలో ఉంటున్నారు. ఆయన కార్యకలాపాలపై స్పష్టత లేకపోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది. కొలంబియాలోని ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో జరిగిన చర్చ వీడియో మాత్రమే బయటకు రావడంతో, మిగతా అంశాలు గోప్యంగానే ఉన్నాయి.రాహుల్‌గాంధీ ఎవరిని కలుస్తున్నారో, ఎక్కడికి వెళు తున్నారో, ఏ అంశాలపై చర్చ జరిపారో కాంగ్రెస్ అధికారికంగా వెల్లడించలేదు. యూనివర్సిటీలో ఆయన పాల్గొన్న కార్యక్రమానికి సంబంధించిన వీడియో కూడా స్పష్టంగా రికార్డ్ కాలేదు. ఈ మౌనం రాజకీయంగా అనుమానాలను కలిగిస్తోంది. కాంగ్రెస్ పార్టీనే ఈ పర్యటన



వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వహించాలి.సాధారణంగా ఇండియాలో టీషర్ట్‌తో కనిపించే రాహుల్‌గాంధీ, కొలంబియాలో మాత్రం సంప్రదాయ భారతీయ దుస్తులు ధరించడంతో చర్చనీయాంశమయ్యారు. ఇది విదేశాల్లో భారతీయ విలువలను ప్రతిబింబించాలనే సంకేతమా లేదా ప్రజలలో కొత్త ఇమేజ్ సృష్టించాలనే ప్రయత్నమా అన్నది అన్వేషణకు గురవుతోంది.రాహుల్ గతంలో కూడా యురోపియన్ యూనియన్, అమెరికా పర్యటనల్లో భారత అంతర్గత అంశాలను ప్రస్తావించారు. కొన్ని సందర్భాల్లో ఆయన వ్యాఖ్యలు విదేశాలలో భారత ప్రభుత్వంపై ప్రతికూల ప్రతిఫలాలను మిగిల్చినట్లు విమర్శకులు పేర్కొన్నారు. ఈసారి కూడా ఆయన కలుసుకుంటున్న వ్యక్తులు, చర్చల అంశాలు ఏవో తెలియకపోవడం రాజకీయ వర్గాల్లో సందేహాలను పెంచుతోంది.భారత్‌లో గట్టి విమర్శల మధ్య విదేశీ పర్యటన చేయడం రాహుల్ రాజకీయ వ్యూహంలో భాగమేమో అన్న ప్రశ్న ముందుకొస్తోంది. బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పొరుగు దేశాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో భారత అంతర్గత రాజకీయాలను పోల్చడం కొందరికి కలవరాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం ఆయన పర్యటన వ్యక్తిగతమా, లేక రాజకీయంగానా అన్నది స్పష్టత లేదుప్రజలు, మీడియాలోని అనేక వర్గాలు రాహుల్ పర్యటన వెనుక ఉన్న ఉద్దేశాన్ని తెలుసుకోవాలనుకుంటున్నాయి. ఆయన కార్యకలాపాలు, కలిసి మాట్లాడిన వ్యక్తుల వివరాలు వెల్లడిస్తే మాత్రమే అనుమానాలు నివారించబడతాయి. నాలుగు దేశాల పర్యటనకు వెళ్లి.. ఒకే దేశంలో ఆరు రోజులు ఉండడం అనుమానాలకు తావిస్తోంది.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com